www.epaper.asthramdaily.com

RNI : TGTEL/25/A1872

సామాన్యుడి అస్త్రం

తెలుగు దిన పత్రిక

సంగారెడ్డి- హైదరాబాద్ | సోమవారం, అక్టోబర్ 26,2026 | ఎడిటర్: పి. జయరాం | సంపుటి: 1 | సంచిక:242 | పేజీలు: 8 | వెల: రూ.5/-

మిత్రధర్మం పాటించాల్సిందే..

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు పార్టీ ముఖ్య నేతలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ ఎన్నికలను అత్యంత సీరియస్‌గా తీసుకోవాలని, ప్రతిఒక్కరూ విజయమే లక్ష్యంగా పనిచేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. 'చెప్పాం-చేస్తున్నాం' అనే నినాదంతో ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, అదే సమయంలో మిత్రధర్మాన్ని తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.టెలీకాన్ఫరెన్స్‌లో చంద్రబాబు మాట్లాడుతూ.. "2024 సార్వత్రిక ఎన్నికల్లో అద్భుత విజయం తర్వాత మనం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నాం. 151 సీట్లతో గెలిచి అరాచకాలు సృష్టించిన గొడ్డలి పార్టీని ప్రజలు కేవలం 11 సీట్లకే పరిమితం చేసి తిరుగుబాటు చేశారు. ఇప్పుడు మనం అధికారంలోకి వచ్చాక సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టాం.

సాంస్కృతిక, ఆర్థిక సంబంధాలు, సాంకేతిక

పరిజ్ఞానం బదిలీకి ప్రాధాన్యం

కొరియా సాంస్కృతిక దినోత్సవంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

- ఆ దేశ సంస్థలతో భాగస్వామ్యానికి సిద్ధం
- ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, ఔషధ రంగాల్లో పెట్టుబడులకు కూడా..
- కొరియా కంపెనీలకు ఆహ్వానం
- భారత్ మధ్య సాంస్కృతిక బంధం



హైదరాబాద్,((సామాన్యుడి అస్త్రం)

రాష్ట్రంలో కొరియా సంస్థల పెట్టుబడులకు వి స్తృత అవకాశాలు ఉన్నాయని, ఉద్యోగాల కల్ప న, సాంకేతిక పరిజ్ఞాన బదిలీ, యువత నైపు ణ్యాభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్ర మార్క పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ వా హనాలు, ఆధునిక తయారీ, లైఫ్ సైన్సెస్, పునరుత్పాదక ఇంధనం, అభివృద్ధి చెంద ుతున్న సాంకేతిక రంగాల్లో కొరియా సంస్థ లతో భాగస్వామ్యాన్ని మరింత విస్తరిస్తామని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో ఆదివారం నిర్వహించిన 'కె హార్మనీ ఫెస్టా' కొరియా కల్చర్ డే కార్యక్రమంలో ఆ యన ప్రసంగించారు. 2024లో సీఎం రేవంత్ రెడ్డి దక్షిణ కొరియా పర్యటనతో ఇరు ప్రాం తాల మధ్య ఆర్థిక భాగస్వామ్యానికి బలమైన పునాది పడిందని భట్టి పేర్కొన్నారు. ఈ భాగ స్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లి పెటు ్టబడులు, ఉపాధి అవకాశాలు పెం పొందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కొరియా ఆర్థిక ప్రగతి నుంచి తెలంగాణ నేర్చుకోవాల్సిన అంశాలు ఎన్నో ఉనా ్నయని..విద్య, నైపుణ్యాభివృద్ధి, మౌలిక సదు పాయాలు, సాంకేతికతపై నిరంతర పెట్టు బడులు అభివృద్ధికి దోహదపడతాయన్నారు. పరిశ్రమలతో పాటు విశ్వవిద్యాలయాలు, పరి శోధనా సంస్థలు, స్టార్టప్లు, చిన్న పరిశ్రమల మధ్య సహకారాన్ని పెంపొందించుకోవాలని ఆకాంక్షించారు. పర్యాటక రంగంలోనూ కొరి యా పెట్టుబడులకు అవకాశాలు ఉన్నా యన్నారు.తెలంగాణ పర్యాటక రంగం కోసం రూ.15,000 కోట్ల పెట్టుబడులను ఆక ర్షించడం, అదనంగా మూడు లక్షల ఉపాధి అవకాశాలను సృష్టించడమే లక్ష్యమని భట్టి వెల్లడించారు. పర్యాటక మౌలిక సదు పాయాలు, ఆతిథ్య రంగం, చలనచిత్ర పర్యా టకం, వెల్నెస్ టూరిజం, సాంస్కృతిక అను భవాల అభివృద్ధిలో కొరియా సంస్థల భాగ స్వామ్యాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు.

ఏపీకి 'అర్ణబ్' తుపాను ముప్పు

అధికారులను అప్రమత్తం చేసిన చంద్రబాబు

- అక్టోబర్ 28న బాపట్ల-విశాఖ మధ్య తీరం దాటే అవకాశం
- తీరం దాటే సమయంలో గంటకు 140 కి.మీ వేగంతో పెనుగాలులు
- భారీ వర్ష సూచనతో అప్రమత్తమైన ప్రభుత్వం, రంగంలోకి ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు
- తుపాను సన్నద్ధతపై సీఎం చంద్రబాబు ఉన్నత స్థాయి సమీక్ష



అమరావతి ,(సామాన్యుడి అస్త్రం)

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం 'అర్ణబ్' తుపాను గా బలపడుతున్న నేపథ్యంలో ఆం ధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమ త్తమైంది. ముఖ్యమంత్రి చంద్రబా బు ఆదివారం ఉన్నతాధికారులతో అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. తుపాను ప్ర భావిత ప్రాంతాల్లో చేపట్టాల్సిన ముందస్తు చర్యలు, సహాయక కార్యక్రమాలపై ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, డీజీపీ హరీశ్ గుప్తా, వివిధ జిల ్లాల కలెక్టర్లు, ఆర్టీజీ అధికారులతో పాటు వ్యవసాయ, విద్యుత్, ఇ రిగేషన్, హోం, వైద్యారోగ్య, పౌ రసరఫరాలు, పురపాలక, పం చాయతీ రాజ్ శాఖల అ ధికారులు ఈ సమీక్షలో పా ల్గొన్నారు. అనుక్షణం అప్ర మత్తంగా ఉంటూ, పక్కా ప్రణ ాళికతో ప్రజలకు ఎలాంటి ఇబ్బ ందులు కలగకుండా చూడాలని సీఎం స్పష్టం చేశారు.

టీజీ కీలక పోర్టల్ టీజీ-ఐపాస్‌పై సైబర్ దాడి

- సర్వర్‌ను హ్యాక్ చేసి డేటాబేస్‌ను ఎన్‌క్రిప్ట్ చేసిన నేరగాళ్లు
- రాన్‌సమ్‌వేర్ దాడిగా నిర్ధారణ.. కేసు నమోదు చేసిన సైబర్ బ్యూరో



హైదరాబాద్,(సామాన్యుడి అస్త్రం)

తెలంగాణ ప్రభుత్వానికి చెందిన కీలకమైన టీజీ-ఐపాస్ పోర్టల్‌పై సైబర్ దాడి జరిగింది. రాష్ట్రంలో పారిశ్రామిక అనుమతులను సులభతరం చేసే ఈ 'గవర్నమెంట్ టు బిజినెస్' (జీ2బీ) ప్లాట్‌ఫారమ్ సర్వర్‌ను హ్యాకర్లు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. డేటాబేస్‌ను ఎన్‌క్రిప్ట్ చేయడంతో పోర్టల్ సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. ఈ ఘటనపై 'తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో' (టీజీసీఎస్‌బీ) కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించింది.

తిరుమలలో మళ్లీ పెరిగిన భక్తుల రద్దీ

- సర్వదర్శనానికి సుమారు 18 గంటల సమయం
- నిన్న ఒక్కరోజే రూ. 3.57 కోట్ల హుండీ ఆదాయం



అమరావతి (సామాన్యుడి అస్త్రం))

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి ద ర్శనానికి భక్తులు భారీగా తరలివ స్తున్నారు. వారాంతపు సెలవుల నే పథ్యంలో శనివారం నుంచి తిరు మల కొండపై భక్తుల రద్దీ గణనీ యంగా పెరిగింది. ప్రస్తుతం టోకెన్లు లేని భక్తులకు స్వామివారి సర్వదర్శ నం కోసం సుమారు 18 గంటల సమయం పడుతోందని తిరుమల తి రుపతి దేవస్థానం (టీటీడీ) అధి కారులు వెల్లడించారు.భక్తుల రద్దీ ఎ క్కువగా ఉండటంతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లన్నీ నిం డిపోయాయి. దీంతో క్యూ లైన్లు వెలు పల ఉన్న శిలాతోరణం వరకు విస్తరి ంచాయి. వారాంతం కావడంతో భ క్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వే స్తున్నారు.

మాదాపూర్‌లో

విషాద ఘటన

- పెళ్లికి నిరాకరించడంతోనే బలవన్మరణం అంటున్న పోలీసులు
- ఆత్మహత్యకు ముందు ప్రియుడికి వీడియో కాల్ చేసిన యువతి



హైదరాబాద్(సామాన్యుడి అస్త్రం)


హైదరాబాద్ నగరంలోని ఐటీ కారిడార్ మాదాపూర్‌లో మరో విషాదం చోటుచేసుకుంది. ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని తన నివాసంలోనే ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతురాలిని ఉత్తరప్రదేశ్‌కు చెందిన అర్చనా చౌదరి మాలిక్‌గా పోలీసులు గుర్తించారు. పెళ్లికి ప్రియుడు నిరాకరించడంతోనే ఆమె ఈ తీవ్ర నిర్ణయం తీసుకున్నారని ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.

ఏపీకి అతి తీవ్ర తుపాను ముప్పు

- ఆంధ్రప్రదేశ్‌పైకి దూసుకొస్తున్న అతి తీవ్ర తుపాను
- అక్టోబర్ 28న విశాఖ-బాపట్ల మధ్య తీరం దాటే అవకాశం
- బాపట్ల నుంచి విజయనగరం వరకు 8 జిల్లాలపై తీవ్ర ప్రభావం

అమరావతి((సామాన్యుడి అస్త్రం)

ఆంధ్రప్రదేశ్‌కు తుపాను గండం పొంచి ఉంది. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం బలపడి, అతి తీవ్ర తుపానుగా మారి రాష్ట్రంపై పంజా విసరనుందని వాతావరణ సంస్థల నివేదికలు చెబుతున్నాయి. ఈ తుపానుకు 'అర్ణబ్' (సముద్రం) అని నామకరణం చేశారు. ప్రభావం ముఖ్యంగా బాపట్ల నుంచి విజయనగరం వరకు ఉన్న 8 తీరప్రాంత జిల్లాలపై అధికంగా ఉంటుందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ) హెచ్చరించింది. అక్టోబర్ 28న మధ్యాహ్నం సమయంలో విశాఖపట్నం-బాపట్ల మధ్య తీరం దాటే అవకాశం ఉందని, ఆ సమయంలో గంటకు 140 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీయొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.



టీజీఎస్ఆర్టీసీ

గుడ్ న్యూస్

- హైదరాబాద్ ప్రయాణికుల కోసం టీజీఎస్ఆర్టీసీ కొత్త వీక్లీ పాస్
- రూ.600 చెల్లిస్తే వారం రోజుల పాటు అన్‌లిమిటెడ్ ప్రయాణం
- ఏసీ బస్సులతో సహా అన్ని సిటీ బస్సుల్లోనూ ఈ పాస్ చెల్లుబాటు
- ఎయిర్‌పోర్ట్ పుష్పక్ సర్వీసులకు మాత్రం మినహాయింపు
- అన్ని సిటీ బస్ పాస్ కౌంటర్లలో ఈ పాస్ అందుబాటులో!



హైదరాబాద్, (సామాన్యుడి అస్త్రం)

హైదరాబాద్ నగరంలో బస్సుల్లో ప్రయా ణించే వారికి తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవా ణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) ఒక శుభవార్త అందించింది. ప్రయాణికుల సౌకర్యార్థం కొత్తగా అన్‌లిమిటెడ్ బస్ పాస్‌ను ప్రవే శపెట్టింది. కేవలం రూ.600 చెల్లించి ఈ పాస్‌ను పొందడం ద్వారా ఏడు రోజుల పాటు నగరంలో అపరిమితంగా ప్ర యాణించవచ్చు.ఈ కొత్త పాస్ కొను గోలు చేసిన తేదీ నుంచి వరుసగా ఏడు రోజుల పాటు చెల్లుబాటులో ఉంటుంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొ ేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలో తిరిగే ఆ ర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, మెట్రో డీలక్స్ బ స్సులతో పాటు ఏసీ బస్సుల్లోనూ ఈ పా స్‌తో ప్రయాణించేందుకు అనుమతి ఉం టుందని టీజీఎస్ఆర్టీసీ స్పష్టం చేసింది.

పింఛన్ బకాయిలపై హైకోర్టు కీలక తీర్పు..

- వితంతు పింఛన్ మంజూరులో జాప్యంపై హైకోర్టులో పిటిషన్
- అధికారుల నిర్లక్ష్యానికి ఎన్నికల కోడ్ సాకుగా చూపొద్దన్న న్యాయస్థానం



అమరావతి ,((సామాన్యుడి అస్త్రం)

పింఛన్ దరఖాస్తులను అధికారులు సుదీర్ఘకాలం పెండింగ్‌లో ఉంచినట్లయితే, ఆ కాలానికి సంబంధించిన బకాయిలను కూడా తప్పనిసరిగా చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు స్పష్టం చేసింది. పరిపాలనాపరమైన జాప్యం కారణంగా దరఖాస్తును ఆలస్యంగా ఆమోదించినప్పటికీ, దరఖాస్తు చేసుకున్న తేదీ నుంచే పింఛన్ బకాయిలను చెల్లించాల్సి ఉంటుందని న్యాయస్థానం తేల్చిచెప్పింది.గుంటూరు జిల్లా పొన్నూరు మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన తాడిశెట్టి తిరుపతమ్మ ఈ మేరకు హైకోర్టును ఆశ్రయించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో హల్‌చల్..

- హైదరాబాద్‌లో డ్రంకెన్ డ్రైవ్‌లో వింత ఘటన
- తనిఖీల్లో పట్టుబడిన ర్యాపిడో డ్రైవర్ అజీజ్

హైదరాబాద్,(సామాన్యుడి అస్త్రం)

హైదరాబాద్ నగరంలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల సందర్భంగా ఓ విచిత్ర ఘటన చోటుచేసుకుంది. మద్యం మత్తులో పట్టుబడిన ఓ ర్యాపిడో డ్రైవర్, విధుల్లో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై దాడి చేసి, కొరికి హల్‌చల్ చేశాడు. ఈ ఘటన చంద్రాయణగుట్ట సమీపంలో జరిగింది.వివరాల్లోకి వెళితే.. ట్రాఫిక్ పోలీసులు చంద్రాయణగుట్ట వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నారు.



సాంస్కృతిక, ఆర్థిక సంబంధాలు, సాంకేతిక పరిజ్ఞానం బదిలీకి ప్రాధాన్యం

మొదటి పేజీ తరువాయి


భారత్ మధ్య సాంస్కృతిక బంధం



కొరియా సంస్కృతి, కళలు, సంగీతం, సంప్రదాయాలను ప్రతిబింబించే ఈ వేడుక రెండు దేశాల ప్రజల మధ్య స్నేహబంధాన్ని మరింత బలోపేతం చేస్తుందని డిప్యూటీ సీఎం భట్టి పేర్కొన్నారు. సాంకేతికత, తయారీ, విద్య, ఆవిష్కరణల్లో ఆ దేశం సాధించిన విజయాలు ప్రశంసనీయమన్నారు. కొరియన్ సంగీతం, సినిమాలు, టెలివిజన్ కార్యక్రమాలు ప్రపంచవ్యాప్తంగా యువతను ఆకర్షిస్తున్నాయన్నారు.భారత్, కొరియా ప్రజల మధ్య విద్య, కుటుంబ వ్యవస్థ, సంప్రదాయాలు, పెద్దల పట్ల గౌరవం వంటి అంశాల్లో సారూప్యతలు ఉన్నాయని తెలిపారు. విభిన్న సంస్కృతులు, భాషలు, సంప్రదాయాల కలయికకు హైదరాబాద్ శతాబ్దాలుగా కేంద్రంగా నిలిచిందని చెప్పారు. బతుకమ్మ, బోనాలు, తెలుగు సాంస్కృతిక వారసత్వం, చారిత్రక కట్టడాలు తెలంగాణ ప్రత్యేకతలని వివరించారు.చార్మినార్, గోల్కొండ కోట, యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశమైన రామప్ప దేవాలయం సహా రాష్ట్రంలో అనేక పర్యాటక ఆకర్షణలు ఉన్నాయని పేర్కొన్నారు. నాగార్జునసాగర్ వద్ద ఉన్న బుద్ధవనం వంటి బౌద్ధ వారసత్వ ప్రదేశాలు భారత్, తూర్పు ఆసియా దేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయగలవన్నారు.కొరియా పర్యాటకులు తెలంగాణను సందర్శించాలని, ఇరు ప్రాంతాల యువత చదువు, పరిశోధన, ఉద్యోగాలు, సృజనాత్మక రంగాల్లో పరస్పరం అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు. భట్టి విక్రమార్కకు భారతదేశంలోని రిపబ్లిక్ ఆఫ్ కొరియా రాయబారి హెచ్.ఈ. లీ సియుంగ్-హో స్వాగతం పలికారు.

ఏపీకి 'అర్ణబ్' తుపాను ముప్పు

మొదటి పేజీ తరువాయి



వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, ప్రస్తుతం విశాఖపట్నానికి తూర్పు ఆగ్నేయంగా 850 కిలోమీటర్లు, కాకినాడకు 930 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉన్న వాయుగుండం వేగంగా బలపడుతోంది. ఇది అక్టోబర్ 26 ఉదయానికి తుపానుగా, అదే రోజు రాత్రికి తీవ్ర తుపానుగా, 27వ తేదీ నాటికి అతి తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అక్టోబర్ 28న ఉదయం నుంచి మధ్యాహ్నం లోగా బాపట్ల--విశాఖపట్నం మధ్య తీరం దాటవచ్చని అంచనా వేస్తున్నారు. ప్రస్తుత అంచనాల ప్రకారం కోనసీమ--యానాం--కాకినాడ తీర ప్రాంతంలో తీరం దాటే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. తుపాను తీరం దాటే సమయంలో గంటకు 115 నుంచి 125 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీస్తాయని, కొన్ని సందర్భాల్లో గాలి వేగం గంటకు 140 కిలోమీటర్ల వరకు చేరవచ్చని హెచ్చరించారు.

భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు

తుఫాను ప్రభావంతో అక్టోబర్ 27, 28 తేదీల్లో ఉత్తరాంధ్ర, మధ్య కోస్తా జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని, కొన్ని చోట్ల అత్యంత భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ముఖ్యంగా కాకినాడ, అనకాపల్లి, విశాఖపట్నం, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలపై గాలులు, వర్షాల ప్రభావం తీవ్రంగా ఉంటుందని అంచనా వేశారు. అనకాపల్లి జిల్లాలో అత్యధికంగా సగటున 292.55 మి.మీ., అల్లూరి సీతారామరాజు జిల్లాలో 281.17 మి.మీ., విశాఖపట్నంలో 253.87 మి.మీ., శ్రీకాకుళంలో 249.18 మి.మీ. వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా ఐదు రోజుల సగటు వర్షపాతం 95 మి.మీ.గా ఉంటుందని అంచనా వేశారు.

చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష

సమీక్ష సందర్భంగా సీఎం చంద్రబాబు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారుల బోట్లన్నీ వెంటనే తీరానికి తిరిగి వచ్చేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సహాయక చర్యల కోసం రాష్ట్రంలో 10 ఎన్డీఆర్ఎఫ్, 11 ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచినట్లు అధికారులు తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, పునరావాస కేంద్రాల్లో ఆహారం, తాగునీరు, వైద్య సదుపాయాలు ఏర్పాటు చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. విద్యుత్ పునరుద్ధరణకు అవసరమైన సామగ్రితో బృందాలను సిద్ధంగా ఉంచాలన్నారు. భారీ వర్షాల వల్ల వచ్చే వరద నీటిని రిజర్వాయర్లలోకి మళ్లించి, నీటిని నిల్వ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. తుపాను తీవ్రత దృష్ట్యా ప్రజలు, అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, సముద్రం అల్లకల్లోలంగా ఉంటున్నందున ఎవరూ వేటకు వెళ్లవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

టీజీఎస్ఆర్టీసీ గుడ్ న్యూస్..

మొదటి పేజీ తరువాయి

అయితే, శంషాబాద్ విమానాశ్రయానికి నడిచే పుష్పక్ ఎయిర్‌పోర్ట్ లైనర్ సర్వీసులకు మాత్రం ఈ పాస్ వర్తించదని అధికారులు తెలిపారు.ప్రయాణికులపై ఆర్థిక భారం తగ్గించడంతో పాటు, బస్సు ప్రయాణాన్ని మరింత సులభతరం చేయాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆర్టీసీ అధికారులు వివరించారు. ఈ కొత్త పాస్‌లు నగరంలోని అన్ని సిటీ బస్ పాస్ కౌంటర్లలో అందుబాటులో ఉంటాయని వారు పేర్కొన్నారు. తరచూ బస్సుల్లో ప్రయాణించే ఉద్యోగులు, విద్యార్థులు, ఇతర ప్రయాణికులకు ఈ పాస్ ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని భావిస్తున్నారు.



ఏపీకి అతి తీవ్ర తుపాను ముప్పు..

మొదటి పేజీ తరువాయి

ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమై సహాయక చర్యలకు సిద్ధమైంది.ఈ తుపాను గత ఏడాది వచ్చిన 'మొంథా' తుపాను కంటే తీవ్రంగా ఉండొచ్చని ఏపీఎస్డీఎంఏ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. ఫోన్‌లో 'ది హిందూ'తో మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు పూర్తి సన్నద్ధతతో ఉన్నామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఇప్పటికే 12 రాష్ట్ర విపత్తుల స్పందన దళం 7 జాతీయ విపత్తుల స్పందన దళంబృందాలు ఉన్నాయని, ముందుజాగ్రత్త చర్యగా మరో మూడు బెటాలియన్లను కేంద్రం నుంచి అభ్యర్థించినట్లు వివరించారు.తుపాను తీవ్రతకు పాత కచ్చా ఇళ్లు, చెట్లు పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉందని, పక్కా ఇళ్లకు కూడా స్వల్ప నష్టం వాటిల్లవచ్చని ఆయన అంచనా వేశారు. బాపట్ల, కృష్ణా, పశ్చిమ గోదావరి, అంబేద్కర్ కోనసీమ, కాకినాడ, అనకాపల్లి, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లోని లోతట్టు ప్రాంతాల ప్రజలను అక్టోబర్ 27వ తేదీలోగా సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలించాలని జిల్లా కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు ప్రఖర్ జైన్ వెల్లడించారు. ఈ పునరావాస కేంద్రాలలో పారిశుద్ధ్యం, నిత్యావసర సరుకుల నిల్వలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. తిరుపతి, నెల్లూరు జిల్లాలపై తుపాను ప్రభావం పెద్దగా ఉండకపోవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.ఆదివారం మధ్యాహ్నానికే తూర్పు మధ్య, ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర వాయుగుండంగా మారింది. ఇది సోమవారం తెల్లవారుజామున తుపానుగా, మంగళవారానికి తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది.

తిరుమలలో మళ్లీ పెరిగిన భక్తుల రద్దీ

మొదటి పేజీ తరువాయి

తిరుమల అప్‌డేట్: శిలాతోరణం వరకు క్యూ లైన్లు.. సర్వదర్శనానికి ఎంత సమయం పడుతోందంటే..?

కాగా, నిన్న (శనివారం) ఒక్కరోజే 81,768 మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా, వీరిలో 34,018 మంది తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 3.57 కోట్లుగా నమోదైనట్లు టీటీడీ పేర్కొంది.



మాదాపూర్‌లో విషాద ఘటన..



మొదటి పేజీ తరువాయి

ఉత్తరప్రదేశ్‌కు చెందిన అర్చనా చౌదరిగా గుర్తింపు

కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న మాదాపూర్ పోలీసులు

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మాదాపూర్‌లోని చంద్రానాయక్ తండా, ఎస్ఆర్ సద్గురు రెసిడెన్సీలో అర్చన నివాసం ఉంటున్నారు. ఆమె స్థానికంగా ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నారు. అర్చనకు ఉత్తరాఖండ్‌కు చెందిన భండారీ విమల్‌తో గత నాలుగేళ్లుగా ప్రేమ వ్యవహారం ఉంది. అయితే, విమల్‌కు అప్పటికే వివాహం కాగా, భార్యతో విడాకుల ప్రక్రియ నడుస్తోంది. ఈ నేపథ్యంలో పెళ్లి చేసుకోవాలని అర్చన, విమల్‌పై ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది.శనివారం తెల్లవారుజామున 2:30 గంటల సమయంలో, విమల్ తన తల్లితో కలిసి చేర్యాలలో ఓ కార్యక్రమానికి వెళ్లినప్పుడు అర్చన అతనికి వీడియో కాల్ చేసింది. తన గదిలోని ఫ్యాన్‌కు ఉరివేసుకుంటున్నట్లు చూపిస్తూ, తనను పెళ్లి చేసుకోకపోతే ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించింది. దీంతో తీవ్ర ఆందోళనకు గురైన విమల్ ఆమెకు పలుమార్లు ఫోన్ చేసినా స్పందన రాలేదు. వెంటనే హుటాహుటిన ఆమె ఫ్లాట్‌కు చేరుకున్నాడు. అయితే, లోపలి నుంచి గడియ పెట్టి ఉండటంతో తలుపులు తెరుచుకోలేదు.వెంటనే విమల్ పోలీసులకు సమాచారం అందించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న మాదాపూర్ పోలీసులు తలుపులు పగలగొట్టి లోపలికి ప్రవేశించగా, అప్పటికే అర్చన ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. క్లూస్ టీమ్ ఘటనా స్థలాన్ని పరిశీలించి, ఆధారాలు సేకరించింది. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా జనరల్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు నేతృత్వంలో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. విమల్‌ను విచారించి మరిన్ని వివరాలు సేకరిస్తామని పోలీసులు తెలిపారు.

టీజీ కీలక పోర్టల్ టీజీ-ఐపాస్‌పై సైబర్ దాడి

మొదటి పేజీ తరువాయి



రాన్‌సమ్‌వేర్ దాడిగా నిర్ధారణ.. కేసు నమోదు చేసిన సైబర్ బ్యూరో

పరిశ్రమల శాఖ ఫిర్యాదుతో ఐటీ చట్టం కింద దర్యాప్తు ప్రారంభం

సోమవారానికి సేవలు పునరుద్ధరించేందుకు అధికారుల ప్రయత్నాలు

అక్టోబరు 22న రాత్రి 11:36 గంటలకు ఈ సైబర్ దాడి జరిగినట్లు అధికారులు గుర్తించారు. పోర్టల్ అప్లికేషన్ పనిచేయకపోవడంతో టెక్నికల్ బృందం వెంటనే రంగంలోకి దిగింది. క్లౌడ్4సీ అనే సంస్థ సహకారంతో సర్వర్‌ను రీస్టార్ట్ చేసేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. లోతుగా పరిశీలించగా.. ఎస్క్యూఎల్ సర్వర్ ఏజెంట్ సర్వీస్ ఆగిపోయినట్లు తేలింది. పునరుద్ధరణ ప్రయత్నాలు విఫలమవడంతో ఇది సాధారణ సాంకేతిక సమస్య కాదని, హ్యాకింగ్ జరిగిందని నిర్ధారణకు వచ్చారు.సర్వర్‌లో మెషిన్ ఐడెంటిఫయర్‌తో కూడిన ఒక రాన్‌సమ్‌నోట్ కనిపించింది. హ్యాకర్లు తమ ఈ-మెయిల్ అడ్రస్‌ను కూడా అందులో ఉంచారు. డేటాను తొలగించకుండా, డేటాబేస్‌ను ఎన్‌క్రిప్ట్ చేసి నిలిపివేయడంతో దీనిని రాన్‌సమ్‌వేర్ దాడిగా భావిస్తున్నారు. ఈ ఘటనపై పరిశ్రమల శాఖ జాయింట్ డైరెక్టర్ సంగా సురేశ్ శనివారం తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు ఫిర్యాదు చేశారు.ఫిర్యాదు స్వీకరించిన టీజీసీఎస్‌బీ అధికారులు, ఐటీ చట్టంలోని సెక్షన్ 43 (కంప్యూటర్ వ్యవస్థలకు నష్టం), సెక్షన్ 66 (సైబర్ నేరాలు) కింద కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ప్రస్తుతం టీజీ-ఐపాస్ సేవలు అందుబాటులో లేవు. హ్యాకర్లు డేటాను కాపీ చేశారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. డేటాబేస్‌ను పూర్తిస్థాయిలో పునరుద్ధరించి, సోమవారం నాటికి సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో హల్‌చల్..

మొదటి పేజీ తరువాయి



విధుల్లో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను కొరికిన డ్రైవర్

రోడ్డుపై హంగామా సృష్టించడంతో అదుపులోకి తీసుకున్న పోలీసులు

కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న అధికారులు

ఈ క్రమంలో అజీజ్ అనే ర్యాపిడో డ్రైవర్‌ను ఆపి పరీక్షించగా, అతడు మద్యం సేవించినట్లు తేలింది. దీంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించారు. ఈ సమయంలో పోలీసుల నుంచి తప్పించుకునేందుకు యత్నించిన అజీజ్, ఓ ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను కొరికాడు.అంతటితో ఆగకుండా రోడ్డుపై గట్టిగా అరుస్తూ హంగామా సృష్టించాడు. దీంతో అప్రమత్తమైన ఇతర పోలీసులు వెంటనే అతడిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసుపై దాడి చేసినందుకు అజీజ్‌పై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తి పోలీసుపైనే దాడికి పాల్పడటం స్థానికంగా కలకలం రేపింది.


‘అస్త్రం’ కథనాల సెగ.. కదిలిన రెవెన్యూ యంత్రాంగం!



- 224 ముసుగులో 69/1 సర్కారీ భూమిలో నిర్మాణాలంటూ ముగ్గురికి నోటీసులు
- 19 ఎకరాల 14 గుంటలు ప్రభుత్వ భూమేనని తేల్చిచెప్పిన తహసీల్దార్.. 300 గజాల నిర్మాణంపై చర్యలకు రంగం సిద్ధం
- సర్వే నం.69/1 ప్రభుత్వ భూమేనని అధికారిక నోటీసులో స్పష్టం.. 22-ూ నిషేధిత జాబితాలో ఉన్నట్లు వెల్లడి
- మదీనగూడ 224 రిజిస్ట్రేషన్ పత్రాల ముసుగులో నిర్మాణాలంటూ ముగ్గురికి సెక్షన్ 7 నోటీసులు
- అక్టోబర్ 26లోగా వివరణ ఇవ్వాలని ఆదేశం.. ఆక్రమణ తొలగింపు, జరిమానా, నిర్మాణాల జప్తునకు చట్టపరమైన అవకాశం

సామాన్యుడి అస్త్రం / మియాపూర్ :

మియాపూర్‌లో ప్రభుత్వ భూముల వ్యవహారం మరో కీలక మలుపు తిరిగింది. ఇన్నాళ్లుగా వివాదాలకు కేంద్రంగా నిలిచిన సర్వే నంబర్ 69/1పై ఎట్టకేలకు రెవెన్యూ యంత్రాంగం కదిలింది. మదీనగూడ సర్వే నంబర్ 224 పేరుతో మియాపూర్ 69/1 ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు చేపడుతున్నారంటూ శేరిలింగంపల్లి రెవెన్యూ అధికారులు ముగ్గురికి నోటీసులు జారీ చేశారు. తెలంగాణ భూ ఆక్రమణ చట్టం–1905లోని సెక్షన్ 7 కింద ఇచ్చిన ఈ నోటీసులు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. అసలు భూమి ఎక్కడుంది? నిర్మాణ అనుమతులు ఏ సర్వే నంబర్‌పై తీసుకున్నారు, ప్రభుత్వ భూమికి ప్రైవేటు సర్వే నంబర్ పత్రాలను ఎలా చూపుతున్నారు, అంటూ ‘సామాన్యుడి అస్త్రం’ వరుస కథనాల్లో లేవనెత్తుతున్న ప్రశ్నల నేపథ్యంలో రెవెన్యూ శాఖ తాజా చర్య ప్రాధాన్యం సంతరించుకుంది. మరీ ముఖ్యంగా, 69/1 ప్రభుత్వ భూమేనని, 22-ూ నిషేధిత జాబితాలో ఉందని అధికారులే లిఖితపూర్వకంగా వెల్లడించడం ఈ వ్యవహారంలో కీలక పరిణామం.



69/1 ప్రభుత్వ భూమే.. రెవెన్యూ శాఖ స్పష్టీకరణ!

మియాపూర్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 69/1లో మొత్తం 19 ఎకరాల 14 గుంటల భూమి ఉన్నట్లు రెవెన్యూ రికార్డులు చెబుతున్నాయి. ఈ భూమి మొత్తం ‘పోరంబోకు సర్కారీ’గా నమోదైందని శేరిలింగంపల్లి డిప్యూటీ కలెక్టర్, తహసీల్దార్ తాజాగా జారీ చేసిన నోటీసులో స్పష్టంగా పేర్కొన్నారు. అంతేకాదు, ప్రభుత్వ ప్రయోజనాలను కాపాడేందుకు ఈ భూమిని రిజిస్ట్రేషన్ చట్టం–1908లోని సెక్షన్ 22-ూ కింద నిషేధిత ఆస్తుల జాబితాలో చేర్చినట్లు కూడా వెల్లడించారు. అంటే ఈ భూమి విషయంలో ప్రభుత్వ రికార్డుల్లో ఉన్న స్థితిని రెవెన్యూ శాఖ మరోసారి అధికారికంగా స్పష్టం చేసింది. ఇప్పుడే అసలు ప్రశ్న మొదలవుతోంది. ప్రభుత్వ భూమిగా నమోదైన స్థలంలో ప్రైవేటు నిర్మాణాలు ఎలా జరుగుతున్నాయి. వాటికి ఆధారంగా చూపుతున్న పత్రాలు ఏ భూమికి సంబంధించినవి. ఆ పత్రాల్లో పేర్కొన్న భూమికి, క్షేత్రస్థాయిలో నిర్మాణాలు జరుగుతున్న స్థలానికి పొంతన ఉందా, అనే విషయాలు ఇప్పుడు తేలాల్సి ఉంది.

224 పేరుతో 69/1లో నిర్మాణాలు!

ఈ వ్యవహారంలో అత్యంత కీలకమైన అంశాన్ని రెవెన్యూ శాఖ నోటీసులోనే బయటపెట్టింది.

మదీనగూడ గ్రామంలోని సర్వే నంబర్ 224 పట్టా భూమి. దాని పక్కనే మియాపూర్ గ్రామంలోని సర్వే నంబర్ 69/1 ప్రభుత్వ భూమి ఉంది. రెండు గ్రామాల సరిహద్దు వద్ద ఈ భూములు ఆనుకొని ఉన్నాయని రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు. అయితే మదీనగూడ సర్వే నంబర్ 224లోని ప్లాట్ నంబర్లు 30, 31కు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలను ఆధారంగా చూపుతూ, మియాపూర్ సర్వే నంబర్ 69/1లోని 300 చదరపు గజాల ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు చేపట్టేందుకు ప్రయత్నిస్తున్నారని కె. శ్రీనివాస్ తదితరులపై రెవెన్యూ శాఖ ఆరోపించింది. నిర్మాణాలను నిలిపివేసేందుకు రెవెన్యూ క్షేత్రస్థాయి సిబ్బంది గతంలో ప్రయత్నించినట్లు కూడా నోటీసులో పేర్కొన్నారు.

ఒక సర్వే నంబర్‌కు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలతో మరో సర్వే నంబర్‌లో నిర్మాణాలు జరుగుతున్నాయని ప్రభుత్వ శాఖే చెబుతున్నప్పుడు, అసలు ఈ వ్యవహారాన్ని ఇంతకాలం ఎవరు పరిశీలించారు? అన్న ప్రశ్న సహజంగానే తలెత్తుతోంది.

అనుమతులు ఇచ్చింది ఎవరు? స్థలాన్ని పరిశీలించారా?

ఈ వివాదంలో మరో కీలక అంశం భవన నిర్మాణ అనుమతులు. రెవెన్యూ శాఖ నోటీసులో ఉటంకించిన హైకోర్టు ఉత్తర్వు ప్రకారం, సంబంధిత ప్లాట్లకు 2025 జనవరి 15న భవన నిర్మాణ అనుమతి మంజూరైంది. ఇప్పుడు అదే స్థల వివాదంలో రెవెన్యూ శాఖ నిర్మాణాలు ప్రభుత్వ భూమిలో జరుగుతున్నాయని పేర్కొనడం అనేక సందేహాలకు దారితీస్తోంది. అనుమతుల దరఖాస్తులో ఏ సర్వే నంబర్ చూపించారు, నిర్మాణ అనుమతులు జారీ చేయడానికి ముందు స్థలాన్ని పరిశీలించారా, గ్రామ సరిహద్దులను, రెవెన్యూ రికార్డులను పరిశీలించారా, అనుమతి పొందిన స్థలం, వాస్తవ నిర్మాణ స్థలం ఒకటేనని నిర్ధారించుకున్నారా, సుమారు గత 30 ఏళ్లుగా కోర్టు వివాదాలు ఉన్న పండగంటి పుట పర్మిషన్ ఎలా వచ్చింది అనే ప్రశ్నలకు సమాధానాలు రావాల్సి ఉంది. కేవలం నోటీసులు ఇచ్చి ఆగిపోకుండా, అనుమతుల జారీకి సంబంధించిన ఫైళ్లు, సైట్ ప్లాన్లు, స్థల పరిశీలన నివేదికలను కూడా అధికార యంత్రాంగం సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది.

హైకోర్టు ఆదేశాల తర్వాతే చట్టపరమైన చర్యలు!

ఈ వివాదంపై కె. శ్రీనివాస్ తదితరులు హైకోర్టును ఆశ్రయించారు. వాళ్ళు పేర్కొన్న పిర్యాదులో నిర్మాణాలకు అధికారులు ఆటంకం కలిగించకుండా ఆదేశించాలని కోరారు. భవన నిర్మాణ అనుమతి మంజూరైన నేపథ్యంలో చట్టబద్ధమైన ప్రక్రియ పాటించకుండా నిర్మాణాల్లో జోక్యం చేసుకోరాదని హైకోర్టు స్పష్టం చేసినట్లు రెవెన్యూ నోటీసులో పేర్కొన్నారు.

అయితే ఈ ఆదేశం ప్రభుత్వ భూమిపై ఆక్రమణ ఆరోపణలను తుది స్థాయిలో పరిష్కరించినట్లు కాదు. చట్టప్రకారం వ్యవహరించాల్సిన అవసరాన్నే సూచిస్తోంది. ఈ నేపథ్యంలోనే రెవెన్యూ శాఖ తెలంగాణ భూ ఆక్రమణ చట్టం–1905లోని సెక్షన్ 7 కింద నోటీసులు జారీ చేయడం గమనార్హం.

ముగ్గురికి నోటీసులు.. అక్టోబర్ 26 వరకు గడువు!

ఈ వ్యవహారంలో కె. శ్రీనివాస్, బి. వెంకట శివారెడ్డి, బి. శివనాగిరెడ్డిలకు రెవెన్యూ శాఖ నోటీసులు జారీ చేసింది. సంబంధిత భూమిపై తమ హక్కులను నిరూపించే రికార్డులతో అక్టోబర్ 26, 2026లోగా శేరిలింగంపల్లి డిప్యూటీ కలెక్టర్, తహసీల్దార్ ఎదుట స్వయంగా లేదా లిఖితపూర్వకంగా వివరణ సమర్పించాలని ఆదేశించింది. వివరణను, ఆధారాలను పరిశీలించిన తర్వాత చట్టప్రకారం ఆక్రమణ తొలగింపు, జరిమానా విధింపు, నిర్మాణాలు లేదా అక్కడ ఉంచిన వస్తువుల జప్తు వంటి చర్యలకు అవకాశం ఉందని నోటీసులో పేర్కొన్నారు.

నోటీసులు సరే.. మరి హద్దుల నిర్ధారణ ఎప్పుడు?

ప్రస్తుత నోటీసు 300 చదరపు గజాల నిర్మాణానికి సంబంధించినదే. కానీ సర్వే నంబర్ 69/1 మొత్తం విస్తీర్ణం 19 ఎకరాల 14 గుంటలు. దీంతో ఈ ఒక్క నిర్మాణంపై చర్యలు తీసుకుంటే సరిపోతుందా, మొత్తం ప్రభుత్వ భూమి సరిహద్దులను నిర్ధారించాల్సిన అవసరం లేదా అనే ప్రశ్నలు ముందుకొస్తున్నాయి. ముఖ్యంగా మియాపూర్ 69/1, మదీనగూడ 224 మధ్య అసలు గ్రామ సరిహద్దు ఎక్కడుందో అధికారిక సర్వే ద్వారా స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం జారీ చేసిన నోటీసుతో పాటు సర్వే రికార్డులు, గ్రామ మ్యాపులు, భవన నిర్మాణ అనుమతులు, స్థల పరిశీలన నివేదికలను ఒకేచోట పరిశీలిస్తేనే వాస్తవాలు మరింత స్పష్టమవుతాయి.

‘అస్త్రం’ నిలదీతలకు సమాధానం చర్యలతోనే!

ప్రభుత్వ భూముల పరిరక్షణ, సర్వే నంబర్ల మధ్య గందరగోళం, నిర్మాణ అనుమతుల వ్యవహారంపై ‘సామాన్యుడి అస్త్రం’ లేవనెత్తుతున్న ప్రశ్నలకు తాజా రెవెన్యూ నోటీసులు ప్రాధాన్యం తీసుకొచ్చాయి. అయితే నోటీసులు జారీ చేయడమే ఈ వివాదానికి ముగింపు కాదు. నోటీసులు అందుకున్నవారు సమర్పించే ఆధారాలను పరిశీలించాలి. నిర్మాణ స్థలం ఏ సర్వే నంబర్ పరిధిలో ఉందో నిర్ధారించాలి. నిర్మాణ అనుమతులు జారీ చేసిన అధికారులు ఏ రికార్డులను పరిగణనలోకి తీసుకున్నారో వెల్లడించాలి.

ప్రభుత్వ భూమిలోనే నిర్మాణాలు జరిగాయని తుది విచారణలో తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో సంబంధిత వ్యక్తుల వివరణను, పత్రాలను పరిశీలించి న్యాయబద్ధమైన నిర్ణయం తీసుకోవాలి. ఇన్నాళ్లుగా ప్రశ్నలకే పరిమితమైన మియాపూర్ 69/1 వ్యవహారం ఇప్పుడు అధికారిక నోటీసుల దశకు చేరింది. ఇక అందరి దృష్టి అక్టోబర్ 26 తర్వాత రెవెన్యూ శాఖ తీసుకునే నిర్ణయంపైనే. నోటీసులతో సరిపెడతారా, ప్రభుత్వ భూమి హద్దులు తేలుస్తారా, నిర్మాణ అనుమతుల వెనుక ఉన్న వాస్తవాలను బయటపెడతారా. ఈ ప్రశ్నలకు రెవెన్యూ యంత్రాంగం ఇచ్చే సమాధానమే 69/1 వ్యవహారంలో తదుపరి కీలక పరిణామం కానుంది.

సంస్థను బలోపేతం చేసి, భవిష్యత్తు తరాలకు ఉపాధి భద్రత

హైదరాబాద్, అక్టోబర్ 25(సామాన్యుడి అస్త్రం)

సింగరేణికి పూర్వ వైభవం తేవడమే ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క(పేర్కొన్నారు. సంస్థను బలోపేతం చేసి, భవిష్యత్తు తరాలకు ఉపాధి భద్రత కల్పించడంతో పాటు బొగ్గు ఉత్పత్తి వ్యయం తగ్గించడం, ఉత్పాదకత పెంచడం, కొత్త గనులను అభివృద్ధి, కీలక ఖనిజాల అన్వేషణలో కి సంస్థను విస్తరించాలనే ఆలోచనలో ప్రభు త్వం ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సంస్థ అధికారులకు సూచించారు.సింగరేణి కాలరీస్ జనరల్ మేనేజర్లతో ఆదివారం ప్ర జాభవన్‌లో నిర్వహించిన ముఖాముఖిలో సంస్థ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలపై వారికి దిశానిర్దేశం చేశారు. ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత సంస్థ సాధించిన ప్రగతిని అధికారులు వివరించారు. గత ప్రభుత్వ నిర్వాహకం వల్ల గతంలో కేటాయించిన బొ గ్గు బ్లాకులను కూడా మళ్లీ వేలం ప్రక్రియలోకి తీసుకురావాల్సిన పరిస్థితి ఏర్పడిందని భట్టి తెలిపారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తి వ్య యం అధికంగా ఉంటే మార్కెట్లో ఇతర సరఫరాదారు లతో పోటీ పడటం కష్టమవుతుం దని, ఉద్యోగుల భవిష్యత్తుపైనా ప్రభావం పడుతుందని హెచ్చరించారు. ఉత్పత్తి వ్య యాన్ని తగ్గించడం, సిబ్బంది, యంత్రాలను సమర్థంగా వినియోగించుకోవడం, పని వి ధానాలను మెరుగుపరచడం ద్వారా ఉత్పాదకత పెంచాలని సూచించారు.రాగి, బంగా రం, వెనేడి యం, లిథియం వంటి కీలక ఖనిజాల అన్వేషణ, తవ్వకాల్లోకి ప్రవేశించాలని సూచించారు. పదేళు అధికారంలో ఉండి సింగరేణిని పట్టించుకోకుండా, నిర్వీర్యం చేయాలని చూసినవారే ఇప్పుడు నష్టం జరుగుతుందంటూ విమర్శలు చేయడం విడ్డూ రంగా ఉందని విమర్శించారు. సింగరేణి సంస్థ సీఎండీ మరియు చైర్మన్ డా.బుద్ధ ప్ర కాష్ జ్యోతి మాట్లాడుతూ..ప్రజా ప్రభుత్వం దిశానిర్దేశంతో సింగరేణి సంస్థను దేశంలోనే అగ్రగామిగా నిలిపేలా కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఇందుకోసం అందరూ కలిసిగట్టుగా



సన్న బియ్యం సరఫరాలో మోసం.. 14 మంది రైస్ మిల్లర్లను అరెస్ట్ చేసిన సీఐడీ



ఎఫ్‌సీఐకి బియ్యం సరఫరాలో అక్రమాలు

సన్న బియ్యం స్థానంలో దొడ్డు బియ్యం సరఫరా చేసినట్లు ఆరోపణలు

నిజామాబాద్, కరీంనగర్, ములుగు జిల్లాల్లో వెలుగుచూసిన మోసం

ప్రభుత్వానికి రూ.1.69 కోట్ల నష్టం వాటిల్లినట్లు అంచనా

హైదరాబాద్, అక్టోబర్25(సామాన్యుడి అస్త్రం)

తెలంగాణలో భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)కు బియ్యం సరఫరా చేసే ప్రక్రియలో భారీ అక్రమాలకు పాల్పడిన 14 మంది రైస్ మిల్లర్లను రాష్ట్ర నేర పరిశోధన విభాగం (సీఐడీ) అరెస్ట్ చేసింది. 2025--26 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి నిబంధనల ప్రకారం 'సన్న రకం' బియ్యాన్ని సరఫరా చేయాల్సి ఉండగా, వాటి స్థానంలో నాసిరకం 'దొడ్డు బియ్యాన్ని' అందజేసినట్లు వీరిపై అభియోగాలు నమోదయ్యాయి.పౌరసరఫరాల సంస్థ జనరల్ మేనేజర్ (ప్రొక్యూర్‌మెంట్) ఈ నెల 24న అందజేసిన ఫిర్యాదు మేరకు సీఐడీ దర్యాప్తు చేపట్టింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తమకు కేటాయించిన సన్న రకం ధాన్యాన్ని మిల్లర్లు బహిరంగ మార్కెట్లో విక్రయించుకుని, అందుకు బదులుగా ఇతర రాష్ట్రాల నుంచి తక్కువ ధరకు సేకరించిన దొడ్డు బియ్యాన్ని ఎఫ్‌సీఐకి అప్పగించినట్లు అధికారులు గుర్తించారు. సేకరించిన నమూనాలను ప్రయోగశాలలో పరీక్షించగా, అవి నిర్దేశిత సన్న రకం బియ్యం కాదని నిర్ధారణ అయ్యింది.నిజామాబాద్, కరీంనగర్, ములుగు జిల్లాల్లోని 16 రైస్ మిల్లులు సన్న బియ్యానికి బదులుగా సుమారు 3,385 టన్నుల దొడ్డు బియ్యాన్ని సరఫరా చేసినట్లు విచారణలో వెల్లడైంది. దీనివల్ల ప్రభుత్వానికి బోనస్ రూపంలో సుమారు రూ.1.69 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. అయితే, అధికారులు అప్రమత్తంగా వ్యవహరించి బియ్యం సేకరణను నిలిపివేయడంతో సుమారు రూ.242 కోట్ల మేర జరగాల్సిన భారీ ఆర్థిక నష్టాన్ని నివారించగలిగారు.ఈ ఉదంతంపై మూడు క్రిమినల్ కేసులు నమోదు చేసిన సీఐడీ అధికారులు దర్యాప్తును వేగవంతం చేశారు. బియ్యం మళ్లింపు, కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ఒప్పంద నిబంధనల ఉల్లంఘన, క్రిమినల్ కుట్ర వంటి సెక్షన్ల కింద విచారణ జరుపుతున్నారు. ఈ కుంభకోణంలో ఎవరైనా ప్రభుత్వ అధికారుల ప్రమేయం ఉందా అనే కోణంలోనూ ఆరా తీస్తున్నారు.

రాహుల్ గాంధీకి రేవంత్ రెడ్డి ఏటీఎం కార్డులా మారారు

రాహుల్ గాంధీకి తెలంగాణ ఒక ఏటీఎంగా మారిందన్న కేటీఆర్

హామీలు గాలికొదిలి కాంగ్రెస్ ప్రజలను మోసం చేస్తోందని విమర్శ

సీఎం రేవంత్ పాలనలో స్కామ్‌లు, అవినీతి పెరిగిపోయిందని ఆరోపణ

2028లో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేసిన కేటీఆర్

హైదరాబాద్, అక్టోబర్25(సామాన్యుడి అస్త్రం)

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం రాహుల్ గాంధీకి ఒక ఏటీఎంగా మారిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏటీఎం కార్డులా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో వరుస కుంభకోణాలు, అవినీతి జరుగుతున్నా రాహుల్ గాంధీ మౌనంగా ఉండటానికి కారణం.. ఇక్కడి నుంచి ఆయనకు ముడుపులు అందుతుండటమేనని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఖైరతాబాద్ నియోజకవర్గానికి చెందిన మైనారిటీ నాయకుడు జిబ్రాన్ షరీఫ్, తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు.

రాహుల్ మౌనం వెనుక మర్మమదే

దేశమంతా తిరుగుతూ 'ఛాత్రోంకీ గూంజ్' అంటూ ఉపన్యాసాలిచ్చే రాహుల్ గాంధీకి తెలంగాణలో అడుగుపెట్టే ధైర్యం లేదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు 420 హామీలిచ్చి, వెయ్యి రోజులు గడుస్తున్నా వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. "రాహుల్ గాంధీ అడ్రస్ లేకుండా పోయారు. తెలంగాణలో ఏం జరుగుతుందో ఆయనకు పట్టడం లేదు. ఎందుకంటే ఆయనకు అందాల్సినవి అందుతున్నాయి. అందుకే ఇక్కడి స్కామ్‌లపై, ప్రభుత్వ వైఫల్యాలపై నోరు మెదపడం లేదు" అని కేటీఆర్ ఆరోపించారు.ఎన్నికలకు ముందు హైదరాబాద్‌లోని అశోక్‌నగర్‌లో టీ స్టాల్ వద్ద కూర్చొని నిరుద్యోగ యువతకు ఉద్యోగాల గురించి భరోసా ఇచ్చిన రాహుల్ గాంధీ, ఇప్పుడు వారిని పూర్తిగా విస్మరించారని అన్నారు. మైనారిటీల కోసం ప్రత్యేక డిక్లరేషన్ ప్రకటించి, సంక్షేమానికి రూ.4,000 కోట్లు కేటాయిస్తామన్న హామీని గాలికొదిలేశారని విమర్శించారు. ఆసరా పెన్షన్‌ను రూ.4,000కు పెంచుతామని, రైతులకు ఎకరానికి రూ.15,000 ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి, ఇప్పుడు మాట తప్పారని మండిపడ్డారు.ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే సమాధానం చెప్పాల్సింది పోయి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తిట్లతో, అక్రమ కేసులతో బెదిరిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు.

మున్సిపల్ పోరుకు సిద్ధంకండి!

- ప్రజల్లో ఉండేవారికే ప్రాధాన్యం.. కష్టపడిన వారికి సముచిత స్థానం
- జనసేన తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ నేమురి శంకర్ గౌడ్
- మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బలంగా పోటీ చేస్తామని వెల్లడి
- వార్డులు, డివిజన్ల స్థాయిలో పార్టీ కమిటీల బలోపేతానికి పిలుపు
- ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలని నాయకులకు సూచన



సామాన్యుడి అస్త్రం / కూకట్‌పల్లి :

తెలంగాణలో రానున్న మున్సిపల్ ఎన్నికల్లో జనసేన బలంగా పోటీ చేస్తుందని, నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు ఇప్పటి నుంచే ఎన్నికలకు సిద్ధం కావాలని పార్టీ రాష్ట్ర ఇంచార్జ్ నేమురి శంకర్ గౌడ్ పిలుపునిచ్చారు. ప్రజలతో నిరంతరం మమేకమవుతూ, స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. పార్టీ ఆవిర్భావం నుంచి తెలంగాణలో జనసేన బలోపేతానికి అంకితభావంతో పనిచేసిన ప్రతి ఒక్కరికీ రాబోయే ఎన్నికల్లో సముచిత స్థానం దక్కుతుందని స్పష్టం చేశారు.కూకట్‌పల్లిలోని జనసేన పార్టీ కార్యాలయంలో మున్సిపల్ ఎన్నికల సన్నద్ధతపై నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నేమురి శంకర్ గౌడ్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఆర్‌కే సాగర్, జాయినింగ్ కమిటీ కన్వీనర్ ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

స్థానిక సమస్యలపై పనిచేయాలి

ఈ సందర్భంగా శంకర్ గౌడ్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే ఆశావహులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. తమ పరిధిలోని సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం నిరంతరం పనిచేయాలన్నారు. పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలు, జనసేన సిద్ధాంతాలు, పార్టీ చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు.కార్పొరేషన్ల పరిధిలో వార్డులు, డివిజన్ల స్థాయిలో కమిటీలను బలోపేతం చేసి, స్పష్టమైన ప్రణాళికతో ముందుకు సాగాలని తెలిపారు. తెలంగాణ రాజకీయ భవిష్యత్తుకు స్థానిక ఎన్నికలు దిక్సూచిగా నిలుస్తాయని అభిప్రాయపడ్డారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.


ప్రజల ఆదరణే అభ్యర్థుల ఎంపికకు ప్రాతిపదిక

ప్రజల్లో ఆదరణ ఉన్నవారికే రానున్న ఎన్నికల్లో కార్పొరేటర్ అభ్యర్థులుగా ప్రాధాన్యం ఉంటుందని జాయినింగ్ కమిటీ కన్వీనర్ ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్ తెలిపారు. స్థానికంగా పార్టీని బలోపేతం చేస్తూ ఎదిగిన నాయకులకు అవకాశాలు దక్కుతాయని చెప్పారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి నాయకులు జనసేనలో చేరుతున్నారని, కొత్తగా వచ్చే వారికి స్వాగతం పలుకుతూ అందరూ కలిసి పార్టీ బలోపేతానికి పనిచేయాలని కోరారు. కష్టపడిన వారిని పార్టీ గుర్తించి సముచిత స్థానం కల్పిస్తుందని పేర్కొన్నారు.

ప్రతి డివిజన్‌లో పార్టీ బలం పెంచాలి

పవన్ కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాల పట్ల ఆకర్షితులై ప్రజలు, నాయకులు జనసేన వైపు చూస్తున్నారని రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఆర్‌కే సాగర్ అన్నారు. ప్రతి నాయకుడు తన డివిజన్‌లో పార్టీ బలాన్ని పెంచుకోవాలని సూచించారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలపై అవగాహన పెంచుకోవడంతోపాటు వాటిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. రాష్ట్ర నాయకుడు మచ్చా సుధాకర్ మాట్లాడుతూ.. రిజర్వేషన్ల ప్రకటన కోసం ఎదురుచూడకుండా ఎన్నికల సన్నద్ధత ప్రారంభించాలని సూచించారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేలా కేడర్‌ను సిద్ధం చేయాలన్నారు. తమ డివిజన్‌తోపాటు పక్క డివిజన్లలోనూ పార్టీ నిర్మాణంపై దృష్టిపెట్టాలని, కమిటీలను సమన్వయం చేసుకుంటూ ప్రజా సమస్యలపై పోరాడాలని కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రాదరాం రాజలింగం, దామోదర్‌రెడ్డి, రామకృష్ణ, కావ్యతోపాటు జీహెచ్ఎంసీ, సీఎంసీ, ఎంఎంసీ పరిధిలోని జనసేన నాయకులు, వీరమహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేవంత్--ఫడ్నవీస్ భేటీపై ఉత్కంఠ



ఫడ్నవీస్‌తో రేవంత్ కీలక భేటీ.. తుమ్మిడిహెట్టిపై తేలేదేంటి?

హైదరాబాద్:(సామాన్యుడి అస్త్రం)

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముంబై పర్యటన రాష్ట్ర సాగునీటి రంగంలో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఎన్నాళ్లుగానో పెండింగ్‌లో ఉన్న తుమ్మిడిహెట్టి (ప్రాజెక్టుకు సంబంధించి మహారాష్ట్ర ప్రభుత్వ అనుమతులు సాధించడమే లక్ష్యంగా తెలంగాణ బృందం కీలక చర్చలకు సిద్ధమైంది. సీఎం రేవంత్ రెడ్డితో పాటు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుఉన్నతాధికారులు ఈ పర్యటనలో పాల్గొంటున్నారు.

152 మీటర్ల ఎత్తుపై కీలక చర్చలు

ముంబైలోని సహ్యాద్రి లో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో తెలంగాణ బృందం సమావేశం కానుంది. ఈ భేటీలో ప్రధానంగా తుమ్మిడిహెట్టి బ్యారేజ్ నిర్మాణం, దాని ఎత్తు, నీటి లభ్యత, రెండు రాష్ట్రాల మధ్య అవసరమైన అనుమతులపై చర్చించనున్నారు. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం బ్యారేజ్‌ను 152 మీటర్లతో నిర్మించేందుకు మహారాష్ట్ర అనుమతి కోరుతోంది. గతంలో 148 మీటర్ల ఎత్తుకు అంగీకారం తెలిపినట్లు సమాచారం ఉండటంతో, ప్రతిపాదిత ఎత్తుపై ఏకాభిప్రాయం సాధించడం ఈ సమావేశంలో కీలక అంశంగా మారింది.

ముంపు ప్రభావం.. తెలంగాణ వాదన ఇదే!

బ్యారేజ్ ఎత్తు పెంపుతో మహారాష్ట్రలో ఎంత భూమి ముంపునకు గురవుతుందన్న అంశం కూడా చర్చల్లో ప్రాధాన్యం సంతరించుకోనుంది. నీటిపారుదల శాఖ అధికారుల వివరాల ప్రకారం, 152 మీటర్ల ఎత్తుతో సుమారు 2,300 ఎకరాల భూమిపై ముంపు ప్రభావం ఉండవచ్చని, 150 మీటర్ల ఎత్తుతో ఈ విస్తీర్ణం వెయ్యి ఎకరాల్లోపే ఉండవచ్చని అంచనా. ఈ , నీటి లభ్యతకు సంబంధించిన వివరాలతో మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు తెలంగాణ బృందం ప్రయత్నించనుంది. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు ఉత్తర తెలంగాణలో సాగునీటి సదుపాయాలను మెరుగుపరచాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. సుమారు రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ప్రణాళికలో ఈ బ్యారేజ్ కీలకంగా భావిస్తున్నారు. ప్రాణహిత నదిపై నిర్మించనున్న ఈ ప్రాజెక్టు ద్వారా నీటిని ఎల్లంపల్లి వరకు తరలించే అవకాశాలు, అవసరమైన నీటి మళ్లింపు విధానాలపై కూడా చర్చించనున్నారుతుమ్మిడిహెట్టి బ్యారేజ్ ఎత్తుపై స్పష్టత వస్తే తదుపరి పనులు, భూసేకరణ, ఇతర సాంకేతిక ప్రక్రియలను ముందుకు తీసుకెళ్లేందుకు మార్గం సుగమమవుతుంది. కేంద్ర జల సంఘం తో గతంలో జరిగిన చర్చలకు సంబంధించిన నివేదికలను కూడా తెలంగాణ అధికారులు సిద్ధం చేస్తున్నారు. అయితే మహారాష్ట్ర నుంచి ఎలాంటి తుది అంగీకారం లభిస్తుందన్నది ఈ భేటీ తర్వాతే స్పష్టమవుతుంది. రేవంత్ రెడ్డి, దేవేంద్ర ఫడ్నవీస్ మధ్య జరిగే ఈ సమావేశం తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు భవిష్యత్తుకు కీలకంగా మారనుంది. తెలంగాణకు అవసరమైన నీటి మళ్లింపు, బ్యారేజ్ ఎత్తు, ముంపు ప్రభావం వంటి అంశాలపై ఏకాభిప్రాయం కుదురుతుందా? ప్రాజెక్టు ముందడుగు వేస్తుందా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

ఎంపీ డీకే అరుణ వ్యాఖ్యలు సరికాదు

నల్లగొండ, అక్టోబర్ 25((సామాన్యుడి అస్త్రం)

డిండి లిఫ్ట్ ప్రాజెక్టును రద్దు చేయాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ వ్యాఖ్యానించడం సరికాదని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామిగా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు జాతీయ హోదా సాధించేందుకు ఆమె కృషి చేయాలని సూచించారు. నల్లగొండలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం మీడియాతో ఆయన మాట్లాడారు. డిండి ఎత్తిపోతల పథకం పూర్తయితే దేవరకొండ, మునుగోడు ప్రాంతాల ప్రజలకు ఫ్లోరైడ్



రక్కసి నుంచి విముక్తి లభిస్తుందని పేర్కొన్నారు. ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలకు రక్షితమైన తాగునీరు అందించాలన్న డబ్ల్యూహెచ్ఓ సూచనను పరిగణనలోకి తీసుకొని ఈ ప్రాజెక్టును రూపొందించారని గుర్తు చేశారు.నీటి వనరులను ప్రాంతాలవారీగా విభజించి వివాదాలు సృష్టించడం మంచి పద్ధతి కాదన్నారు. ఏ జిల్లా నీరు ఆ జిల్లానే వినియోగించుకోవాలనే వాదన సరికాదని, ఇదే విధానం ఇతర రాష్ట్రాలు అనుసరిస్తే కర్ణాటక నుంచి తెలంగాణకు చుక్క నీరూ రాదని వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వం కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులను పట్టించుకోలేదని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై పెట్టిన ఖర్చులో సగం కేటాయించినా అవి పూర్తయ్యేవని అభిప్రాయపడ్డారు. ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే పరిస్థితులను సీఎం ఇప్పటికే ప్రజలకు వివరించారని పేర్కొన్నారు.

‘తుమ్మిడిహెట్టి’కి ఎలాగైనా ఒప్పిద్దాం

తెలంగాణ, మహారాష్ట్ర ముఖ్యమంత్రుల భేటీ

ముంబైలో ఉదయం11 గంటలకు సమావేశం..

బ్యారేజీ ఎత్తు, భూసేకరణపై చర్చించనున్న రేవంత్, ఫడణవీస్

ఆదివారం రాత్రే ముంబైకి బయలుదేరి వెళ్లిన రేవంత్‌రెడ్డి

o152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మించాలని పట్టుదలగా ఉన్న సీఎం

అందుకు మహారాష్ట్ర ముఖ్యమంత్రిని ఒప్పించాలని కృతనిశ్చయం

భేటీలో పాల్గొననున్న ఇరు రాష్ట్రాల సాగునీటిశాఖల మంత్రులు



తుమ్మిడిహెట్టి కోసం పట్టువదలక ప్రయత్నాలు

హైదరాబాద్, అక్టోబరు 25 (సామాన్యుడి అస్త్రం)

డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టులో తుమ్మిడిహెట్టి బ్యారేజీ కీలకమైనది. గతంలో ఒప్పందాల దశలోనే ఆగిపోయిన ఈ ప్రాజెక్టును సాకారం చేసేందుకు సీఎం రేవంత్ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచారు. 2016 ఆగస్టు 23న అప్పటి తెలంగాణ ప్రభుత్వం మహారాష్ట్రతో కుదుర్చుకున్న ఒప్పందంలో తుమ్మిడిహెట్టి బ్యారేజీ నీటి మట్టాన్ని o148 మీటర్లకు పరిమితం చేసింది. ఆ తర్వాత కాళేశ్వరం ఎత్తిపోతల పథకాన్ని ముందుకు తెచ్చి తుమ్మిడిహెట్టిని పక్కనపెట్టింది. దీంతో ఆదిలాబాద్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాలకు ఆశించిన స్థాయిలో సాగు, తాగునీరు అందలేదు.రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక o152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచారు. గత ఏప్రిల్ 9న నిర్వహించిన సమీక్షలో బ్యారేజీ నిర్మాణ కార్యాచరణను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. మహారాష్ట్ర ప్రభుత్వంతో వెంటనే సంప్రదింపులు ప్రారంభించాలని కోరారు. మే 6న బ్యారేజీపై చర్చలకు సమయమివ్వాలని మహారాష్ట్ర సీఎంకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి లేఖ రాశారు. మే 26న ఫడణవ?సకు సీఎం రేవంత్‌రెడ్డి ఈ విషయంపై స్వయంగా లేఖ రాశారు. మహారాష్ట్రతో ఉన్న పెండింగ్ అంశాల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని జూన్ 11న ప్రధానమంత్రి నరేంద్రమోదీకి కూడా లేఖ రాశారు. ఆ లేఖను ప్రధాని కార్యాలయం కేంద్ర జల్‌శక్తి శాఖకు పంపింది. ఆగస్టు 5న సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్‌లు ఢిల్లీలో కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిసి బ్యారేజీ ఎత్తు పెంపునకు మహారాష్ట్రను ఒప్పించాలని కోరారు.o148 మీటర్ల ఎత్తు వద్ద గ్రావిటీ ద్వారా ఆశించిన స్థాయిలో నీటిని తరలించడం సాధ్యంకాదని, o150 నుంచి o152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మిస్తే గ్రావిటీ ద్వారా నీటిని తరలించి విద్యుత్ వ్యయాన్ని తగ్గించవచ్చని తెలిపారు. దీంతో కేంద్ర జలసంఘం ఆధ్వర్యంలో రెండు రాష్ట్రాల అధికారులతో సమావేశం నిర్వహిస్తామని, అనంతరం రెండు రాష్ట్రాల నీటి పారుదల శాఖల మంత్రులతో భేటీ ఏర్పాటు చేస్తామని కేంద్రమంత్రి హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో సెప్టెంబరు 1న కేంద్ర జలసంఘం చైర్మన్ అధ్యక్షతన అంతర్‌రాష్ట్ర సమావేశం నిర్వహించి తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక, అంతర్‌రాష్ట్ర అంశాలపై చర్చించారు. సీడబ్ల్యూపీఆర్ఎస్ పుణె నిర్వహించిన బ్యాక్ వాటర్ అధ్యయనాలను తెలంగాణ ప్రభుత్వం సెప్టెంబరు 3న మహారాష్ట్ర జల వనరుల శాఖకు పంపించింది. o148 నుంచి o152 మీటర్ల వరకు వివిధ నీటి మట్టాల్లో ముంపు ప్రభావాన్ని చూపించే కాంటూర్ మ్యాపులను అందజేసింది. ఈ నేపథ్యంలో నేడు జరగనున్న సీఎంల సమావేశంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

యాదాద్రి ప్లాంట్‌ను ఎందుకు పూర్తి చేయలేదు?



పదేళ్లు కమీషన్లు ఏరుకోవడం తప్ప విద్యుత్తు మంత్రిగా ఏనాడైనా సమీక్ష చేశావా?

జగదీశ్‌రెడ్డిపై ప్రభుత్వ విప్ వీరేశం ధ్వజం

హైదరాబాద్, అక్టోబరు 25(సామాన్యుడి అస్త్రం)

పదేళ్లు అధికారంలో ఉండి యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను ఎందుకు పూర్తి చేయలేకపోయారంటూ మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని ప్రభుత్వ విప్ వేముల వీరేశం నిలదీశారు. కమీషన్లు ఏరుకోవడం తప్ప విద్యుత్తుశాఖ మంత్రిగా ఏనాడైనా సమీక్ష చేశావా అని ప్రశ్నించారు. చేసిన విధ్వంసం, నష్టాన్ని కప్పి పుచ్చుకునే ఆరాటంలో ప్రజలకు అబద్ధాలు చెప్పే ప్రయత్నం జగదీశ్ రెడ్డి చేస్తున్నాడని, తన మాటలతో సెల్ఫ్ గోల్ చేసుకుంటున్నాడన్నారు. ఆదివారం సీఎల్పీ మీడియా హాల్లో ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు.యాదాద్రి పవర్ ప్లాంట్ కోసం విదేశాల నుంచి బొగ్గు దిగుమతికి ఒప్పందాలు చేసుకున్నది.. ప్రతిమ గ్రూప్‌కు బొగ్గు దిగుమతి చేసుకునే అవకాశం కల్పించి 50 ఏళ్లలో రూ.లక్ష కోట్లు కట్టబెట్టే ప్రయత్నం చేసింది నిజం కాదా? పవర్ ప్లాంట్ నిర్మాణ వ్యయం అంచనాలు పెంచింది వాస్తవం కాదా? ఎక్కువ ధరకు ఛత?సగఢ్‌తో విద్యుత్తు కొనుగోలుకు ఒప్పందం చేసుకున్నది బీఆర్ఎస్ సర్కారు కాదా? దీని వెనకున్న లోపాయికారి ఒప్పందం ఏంటి?’ అంటూ నిలదీశారు.ఈ అక్రమాలు బయటికి వస్తాయన్న భయంతోనే జగదీశ్ రెడ్డి అడ్డగోలుగా మాట్లాడుతున్నాడన్నారు. అప్పుల కుప్ప తెలంగాణను ప్రజలకు ఇచ్చి, ఆస్తులు మాత్రం బీఆర్ఎస్ నేతలు సంపాదించుకున్నారని ఆరోపించారు. జగదీశ్ రెడ్డి నల్లగొండ జిల్లాకు ఆయన ఒక శాపంగా మారాడంటూ ధ్వజమెత్తారు. కాళేశ్వరం పేరుతో రూ.లక్షన్నర కోట్ల ప్రజాధనాన్ని గంగపాలు చేసిన బీఆర్ఎస్ నేతలు.. నీళ్లు ఎత్తిపోయాలంటూ అడ్డదిడ్డంగా మాట్లాడుతున్నారని అనిల్‌కుమార్‌రెడ్డి మండిపడ్డారు.

పీర్జాదిగూడలో ఆర్థిక మోసగాడి అరెస్టు



మ్యాట్రిమోనీ సైట్‌లో పరిచయంతో రూ.1.18 కోట్ల కుచ్చుటోపీ

బాధితురాలు నిలదీస్తే.. పరువు తీస్తానని బ్లాక్‌మెయిల్

గతంలో అతడిపై హత్య, గంజాయి కేసులు

హైదరాబాద్ (సామాన్యుడి అస్త్రం)

మ్యాట్రిమోనీ సైట్ ద్వారా ఒంటరి మహిళతో పరిచయం పెంచుకుని.. పెళ్లి చేసుకుంటానని నమ్మించడంతోపాటు శారీరక సంబంధం ఏర్పరుచుకుని విడతల వారీగా రూ.1.18 కోట్లు స్వాహా చేసిన ఘరానా మోసగాడిని మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని మేడిపల్లి పోలీసులు అరెస్టు చేసి, ఆదివారం రిమాండ్‌పై తరలించారు. మేడిపల్లి – పీర్జాదిగూడ ప్రాంత మహిళ (41)తో కమ్మ మ్యాట్రిమోనీ సైట్‌లో 2024లో పరిచయం పెంచుకున్న కోనేటి ప్రదీప్ (41).. తనకు తల్లిదండ్రుల్లేరని, అనివార్య కారణాలతో తనకు విడాకులయ్యాయని నమ్మించి.. క్రమంగా శారీరక సంబంధం పెట్టుకున్నాడు.తన పెళ్లి జరుగుతుందన్న నమ్మకంతో బాధితురాలు అతడు అడిగినప్పుడల్లా డబ్బులిస్తూ వచ్చింది. అలా గత రెండున్నరేళ్లలో రూ.1.18 కోట్లు తీసుకున్న సదరు వ్యక్తి.. ఆమె పెళ్లి ప్రస్తావన తెచ్చినప్పుడల్లా దాటవేశాడు. కొద్ది రోజుల క్రితం ప్రదీప్‌ను నిలదీసిన బాధితురాలు.. తన డబ్బు తనకివ్వాలని ఒత్తిడి చేయడంతో తనతో ఆమె సన్నిహితంగా ఉన్న ఫొటోలు చూపాడు.తనకు మరో రూ.4 లక్షలు ఇవ్వాలని, లేకుంటే ఆ ఫొటోలను సోషల్ మీడియాలో పోస్టు చేసి పరువు తీస్తానని ప్రదీప్ బెదిరించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన మేడిపల్లి పోలీసులు నిందితుడ్ని అరెస్టు చేసి ఆదివారం రిమాండ్‌పై తరలించాడు. ఈ కేసు దర్యాప్తు క్రమంలో మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లోనే ఒక హత్య, గోల్కొండ, తిరుమలగిరి పోలీస్ స్టేషన్ల పరిధిలో గంజాయి (ఎన్‌డీపీఎ?స) కేసులున్నాయని పోలీసులు గుర్తించారు.

తరుముకొస్తున్న తుఫాను



28న పలు జిల్లాల్లో భారీ వర్షాలు

హైదరాబాద్, (సామాన్యుడి అస్త్రం)

ఆగ్నేయ బంగాళాఖాతంలో కొనసాగుతున్న వాయుగుండం ఆదివారం మరింత బలపడి తీవ్ర వాయుగుండంగా మారింది. మధ్యాహ్నానికి తూర్పు ఆగ్నేయంగా విశాఖకు 870 కిలోమీటర్లు, కాకినాడకు 960 కిలోమీటర్లు, మచిలీపట్నానికి 1,060 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. సోమవారం ఉదయానికి నైరుతి దిశలో పయనించే క్రమంలో తుఫాన్‌గా మారనుంది. దీనికి ‘ఆర్నబ్’ అని పేరు పెట్టారు. ఈనెల 27న ఉదయానికిపశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ప్రవేశించే సమయానికి తీవ్ర తుఫాన్‌గా, సాయంత్రానికి అతి తీవ్ర తుఫానుగా బలపడనున్నది. 28వ తేదీ ఉదయం విశాఖపట్నం– మచిలీపట్నం మధ్య తీరం దాటనుంది.దీని ప్రభావంతో ఈనెల 28 నుంచితెలంగాణలోని పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతీ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు.. వరంగల్, హన్మకొండ, సూర్యాపేట, నల్గొండ, భూపాలపల్లి, యాదాద్రి భువనగిరి, జనగామ జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వానలు పడతాయని.. హైదరాబాద్‌లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు తెలిపారు. తుఫాను ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా రాత్రి ఉష్ణోగ్రతలు 14 – 16 డిగ్రీలకు పడిపోవచ్చని వెల్లడించారు. మరోవైపు ఆర్నబ్ తుఫాను కోస్తాంధ్ర జిల్లాలపై తీవ్ర ప్రభావం చూపించనుంది.

మేడిగడ్డ వద్ద పంపులు నడిపేంత నీటి మట్టం

దిగువన సీతారామ ద్వారా ఒడిసిపడుతున్నాం

ఇకనైనా తప్పుడు ప్రచారం మానుకో: ఆది శ్రీనివాస్

కేటీఆర్‌వి మతి లేని మాటలు: విజయ రమణారావు


ఆయన్ను రైతులెవరూ నమ్మే పరిస్థితి లేదు

హైదరాబాద్, అక్టోబరు 25 (సామాన్యుడి అస్త్రం)

‘కన్నెపల్లి పంప్‌హౌస్ దగ్గర నుంచి గోదావరి నీళ్లు కిందకు అన్యాయంగా పోతున్నాయంటూ కేటీఆర్ దొంగ ఏడుపులు ఏడుస్తున్నాడు. ఆయన దొంగ ఏడుపులు చాలు. ఆ నీళ్లు ఎక్కడికీ పోవు. తెలంగాణ అవసరాల కోసమే వాడుతున్నాం. దేవాదులలో నీళ్లను నిరంతరం ఎత్తిపోస్తున్నాం. తర్వాత కింద ఉన్న సీతారామ ఎత్తిపోతలతో నీటిని ఒడిసిపడుతున్నాం. తెలంగాణ నుంచి వెళ్లే గోదావరి నీటిని ప్రభుత్వం సంపూర్ణంగా వాడుకుంటోంది’ అంటూ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. కమీషన్లకు కక్కుర్తి పడి రూ.లక్ష కోట్లతో కాళేశ్వరాన్ని నిర్మించి కూలేశ్వరం చేసిన కల్వకుంట్ల కుటుంబం ఇంకా సిగ్గులేకుండా మాట్లాడుతోందని ఓ ప్రకటనలో ధ్వజమెత్తారు. కాళేశ్వరం నుంచి వెళ్లిపోయిన నీళ్లన్నీ ఏపీకే పోతున్నాయని కేటీఆర్, ఆయన భజన బృందం తప్పుడు ప్రచారం చేస్తోందని.. అది మానుకుంటే మంచిదన్నారు. ‘కన్నెపల్లి నుంచి నీళ్లు ఎత్తి పోయాలని కేటీఆర్, బీఆర్ఎస్ నేతలు పదే పదే మాట్లాడుతున్నారు.మేడిగడ్డ కుంగిన విషయం ఈ సన్నాసులకు తెలియదా? దీనిపై ఇప్పటివరకు ప్రజలకు క్షమాపణ కూడా చెప్పలేదు. కాళేశ్వరం బ్యారేజీల్లో నీటిని నింపితే కొట్టుకుపోవడం ఖాయమని ఎన్డీఏ?సఏ ఇచ్చిన నివేదిక కేటీఆర్‌కు కనిపించడం లేదా? అన్నారం, సుందిళ్ల బ్యారేజీలలో సీపేజీ వచ్చింది. అక్కడ నీళ్లు నిల్వ చేసే పరిస్థితి లేదు. అయినా ఎందుకు తప్పుడు ప్రచారం చేస్తున్నారు?’ అంటూ నిలదీశారు. కేటీఆర్ గడ్డం పెంచితే సరిపోదని, బుర్రలో మెదడు కూడా ఉండాలన్నారు. కాళేశ్వరం ఎప్పుడైతే కూలేశ్వరం అయిందో, ఆ నాడే కల్వకుంట్ల కుటుంబం ఖతమైపోయిందని విమర్శించారు. కన్నెపల్లి పంప్‌హౌస్ దగ్గర 20 వేల క్యూసెక్కుల నీళ్లు ప్రవహిస్తున్నాయని, అవి నేరుగా ఏపీకి పోతున్నాయని కేటీఆర్ దిమాక్ లేని మాటలు మాట్లాడుతున్నాడని ప్రభుత్వ విప్ విజయరమణారావు ధ్వజమెత్తారు.ఆ నీళ్లు దేవాదుల, సీతారామసాగర్‌ల ద్వారా ఎత్తిపోస్తున్నామని చెప్పారు. ఇది తెలిసి కూడా సిగ్గు లేకుండా కేటీఆర్.. తప్పుడు ప్రచారం చేస్తున్నాడని ఓ ప్రకటనలో మండిపడ్డారు. కేటీఆర్ మాటలు రైతులు, ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. కాళేశ్వరం బ్యారేజీల్లో నీళ్లు నింపితే ఉండవని.. వాటిని రీడిజైన్ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ ప్రయత్నం చేస్తున్నారన్నారు. కాళేశ్వరం నుంచి ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు ఏనాడైనా చుక్క నీరు ఇచ్చారా అంటూ కేటీఆర్‌ను ప్రశ్నించారు. ఉమ్మడి మెదక్ జిల్లాను సస్యశ్యామలం చేయడానికి, కేసీఆర్ ఫాం హౌస్‌కు నీళ్లు తెచ్చుకోవడం కోసమే కాళేశ్వరం నిర్మించారని దుయ్యబట్టారు. ప్రాణహిత–చేవెళ్ల కోసం రూ.11 వేల కోట్లు కాంగ్రెస్ ప్రభుత్వం ఖర్చు పెట్టిందని, మరో రూ.20 వేల కోట్లు ఖర్చుపెట్టి తుమ్మిడిహెట్టి పూర్తి చేసి ఉంటే చేవెళ్ల వరకు నీళ్లు వచ్చేవని వ్యాఖ్యానించారు.

కేటీఆర్‌ది పిచ్చి ప్రచారం..: మేడిపల్లి సత్యం

మేడిగడ్డ వద్ద పంపులు నడిచేంత నీటి మట్టం ఉందా అంటూ కేటీఆర్‌ను కాంగ్రెస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రశ్నించారు. అలాగని గేట్లు మూసి నీటిని నిల్వ చేసే పరిస్థితీ లేదన్నారు. ఇది తెలిసి కూడా కన్నెపల్లి పంప్ వద్ద గోదావరి నీళ్లను ప్రభుత్వం ఏపీకి వృథాగా వదిలేస్తోందంటూ కేటీఆర్ పిచ్చి ప్రచారం చేస్తున్నాడని ధ్వజమెత్తారు.



మేడిగడ్డ దిగువన దేవాదుల, సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టుల ద్వారా నీటిని వినియోగిస్తున్నది కేటీఆర్‌కు కనిపించట్లేదా అని ఓ ప్రకటనలో ప్రశ్నించారు. ‘ఆదివారం సాయంత్రం 6 గంటలకు మేడిగడ్డ బ్యారేజీ వద్ద గోదావరి ప్రవాహం 17,900 క్యూసెక్కులుగా ఉంది. మొత్తం 85 గేట్లు తెరిచి ఉన్నాయి. ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో సమానంగా ఉన్నాయి.నది ఫ్రీ ఫ్లో పరిస్థితిలో ప్రవహిస్తోంది. గోదావరిలో ప్రవాహం ఉండటం వేరు, ఆ నీటిని ఎత్తిపోసేందుకు అవసరమైన కనీస నీటిమట్టం ఉండటం వేరు. కన్నెపల్లి లక్ష్మీ పంప్‌హౌస్ నుంచి నీటిని ఎత్తాలంటే మేడిగడ్డ వద్ద కనీసం o93.50 మీటర్ల నీటిమట్టం అవసరం. కానీ ప్రస్తుతం ఉన్నది o89.20 మీటర్లే. ఆ నీటి మట్టంతో పంపులు నడువవు.

జడ్పీటీసీ, ఎంపీటీసీ నామినేషన్ల తుది జాబితా

పరిషత్ ఎన్నికల నామినేషన్ల తుది జాబితాను విడుదల చేసిన ఎస్ఈసీ
9,829 ఎంపీటీసీ స్థానాలకు 46,045 నామినేషన్లు ఖరారు
659 జడ్పీటీసీ స్థానాలకు 4,770 నామినేషన్లకు ఆమోదం
నామినేషన్ల సంఖ్యలో టీడీపీ, వైసీపీ మధ్య గట్టి పోటీ
తిరుపతి జిల్లాలో అత్యధికంగా జడ్పీటీసీ నామినేషన్ల దాఖలు



అమరావతి ,అక్టోబర్25(సామాన్యుడి అస్త్రం)

ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న పరిషత్ ఎన్నికల ప్రక్రియలో కీలక ఘట్టం ముగిసింది. రాష్ట్రంలోని 28 జిల్లాల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు దాఖలైన నామినేషన్ల పరిశీలన అనంతరం రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) ఆదివారం తుది జాబితాను ప్రకటించింది. నామినేషన్ల తిరస్కరణ తర్వాత ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల వివరాలను అధికారులు అధికారికంగా వెల్లడించారు.రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 9,829 ఎంపీటీసీ స్థానాలకు గాను 46,045 నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. పార్టీల వారీగా పరిశీలిస్తే.. టీడీపీ నుంచి 19,760, వైసీపీ నుంచి 17,726, జనసేన నుంచి 4,330, బీజేపీ నుంచి 1,049 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వీరితో పాటు మరో 2,012 మంది స్వతంత్ర అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఎంపీటీసీ స్థానాలకు మొత్తం 51,902 నామినేషన్లు దాఖలు కాగా, వివిధ కారణాలతో అధికారులు 5,857 నామినేషన్లను తిరస్కరించారు.మరోవైపు, 659 జడ్పీటీసీ స్థానాలకు 4,770 నామినేషన్లు ఆమోదం పొందాయి. వీటిలో టీడీపీ తరఫున 1,693, వైసీపీ తరఫున 1,445, జనసేన నుంచి 587, బీజేపీ నుంచి 227 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. మరో 227 మంది స్వతంత్ర అభ్యర్థులు సైతం ఎన్నికల బరిలో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.జడ్పీటీసీ స్థానాలకు మొత్తం 5,724 నామినేషన్లు రాగా, వాటిలో 954 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. జిల్లాల వారీగా గణాంకాలను పరిశీలిస్తే.. తిరుపతి జిల్లాలో 35 జడ్పీటీసీ స్థానాలకు అత్యధికంగా 280 నామినేషన్లు ఆమోదం పొందాయి. కడప జిల్లాలో 39 స్థానాలకు 215, విశాఖ జిల్లాలో 4 స్థానాలకు 46 నామినేషన్లు ఖరారయ్యాయి.

ఆగర్భ శత్రువులను సైతం పెళ్లి వేడుక కలుపుతుంది.. కానీ జగన్ మాత్రం..!: బుద్ధా వెంకన్న



మేనకోడలు పెళ్లికి అడ్డుపడుతున్న కలియుగ కంసమామ జగన్ అంటూ బుద్ధా విమర్శలు
దౌర్జన్యాలు, దాడులే వైసీపీ రాజకీయ అస్త్రాలని తీవ్ర విమర్శ
2021 స్థానిక ఎన్నికల్లో వైసీపీ విధ్వంసాలు సృష్టించిందన్న బుద్ధా
ఓటమి భయంతోనే ఎన్నికల ప్రక్రియను అడ్డుకునేందుకు కుట్రలని ఆరోపణ
వేల నామినేషన్లు వేసి, అడ్డుకుంటున్నారని వైసీపీ దొంగ ఏడుపులు ఏడుస్తోందని ఎద్దేవా

అమరావతి ,అక్టోబర్25(సామాన్యుడి అస్త్రం)

వైసీపీ అధినేత జగన్ తన సొంత మేనకోడలు పెళ్లికి అడ్డుపడుతూ కలియుగ కంసమామలా వ్యవహరిస్తున్నారని టీడీపీ సీనియర్ నేత బుద్ధా వెంకన్న తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తండ్రి తర్వాత తండ్రిలాంటి మేనమామే దగ్గరుండి పెళ్లి చేయాల్సిన బాధ్యతను మరిచి, భద్రత పేరుతో వివాహ వేదికకు స్థలం ఇవ్వకుండా అడ్డుకోవడం జగన్ దుర్మార్గపు మనస్తత్వానికి నిదర్శనమని మండిపడ్డారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ఆయన ఆదివారం మీడియా సమావేశంలో మాట్లాడారు. ఆగర్భ శత్రువులను సైతం పెళ్లి వేడుక కలుపుతుందని, కానీ వివాహ సంప్రదాయాలపై జగన్‌కు ఏమాత్రం నమ్మకం లేదని విమర్శించారు. ఆస్తి కోసం సొంత చెల్లిని, కన్నతల్లిని ఇంటి నుంచి గెంటేసిన వ్యక్తి ప్రపంచంలో ఎవరూ ఉండరని, అలాంటి వ్యక్తికి మానవతా విలువలు ఎక్కడివని ప్రశ్నించారు. జగన్‌కు రాజకీయ విలువలతో పాటు, కనీస కుటుంబ విలువలు కూడా లేవని ఆయన తీవ్రంగా విరుచుకుపడ్డారు.

దౌర్జన్యాలు, దాడులే జగన్ రాజకీయం

దౌర్జన్యాలు, అక్రమాలు, దాడులే జగన్ కు తెలిసిన రాజకీయమని బుద్ధా వెంకన్న ఆరోపించారు. బిందెడు పాలలో విషపు చుక్క వేసినట్లు, రాష్ట్ర అభివృద్ధిలో జగన్ విషపు చుక్కలు వేశారని దుయ్యబట్టారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరుగుతుంటే, ఓటమి భయంతో అల్లర్లు సృష్టించి ఎన్నికలను అడ్డుకోవాలని వైసీపీ కుట్రలు పన్నుతోందని విమర్శించారు. ఒకవైపు కూటమి పార్టీలకు పోటీగా వేల నామినేషన్లు దాఖలు చేసి, మరోవైపు తమను నామినేషన్లు వేయనీయడం లేదని దొంగ ఏడుపులు ఏడవడం వైసీపీకే చెల్లిందన్నారు. ఎంపీటీసీ స్థానాలకు 20,556, జడ్పీటీసీ స్థానాలకు 1,815 నామినేషన్లు వేసిన వైసీపీ, ఇప్పుడు గగ్గోలు పెట్టడం వారి డ్రామాలకు పరాకాష్ఠ అని మండిపడ్డారు. "దాడుల గురించి మాట్లాడే జగన్, 2020లో మాచర్లలో నాపై జరిగిన హత్యాయత్నాన్ని కూడా గుర్తుచేసుకోవాలి" అని బుద్ధా సూచించారు.

2021 విధ్వంసకాండను మర్చిపోలేదు

2021 స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని జగన్ చెప్పడం పచ్చి అబద్ధమని బుద్ధా వెంకన్న కొట్టిపారేశారు. ఆ ఎన్నికల్లో వైసీపీ సృష్టించిన విధ్వంసకాండను దేశం మొత్తం చూసిందని గుర్తుచేశారు. "2020లో మాచర్లలో నాపై, బోండా ఉమాపై, హైకోర్టు న్యాయమూర్తి పీఏ కిశోర్‌పై ఇనుప రాడ్లతో హత్యాయత్నానికి పాల్పడ్డారు. హిందూపురంలో కౌంట్రాక్టింగ్ కేంద్రంపై, నెల్లూరు జిల్లా కావలిలో మా పార్టీ కార్యాలయంపై దాడులు చేశారు. పిఠాపురంలో ఏకంగా బ్యాలెట్ బాక్సులనే ఎత్తుకెళ్లిపోయారు. గుంటూరులోని మారెళ్ళవారిపాలెంలో రిగ్గింగ్ ఓట్లు వేసుకుంది మీరు కాదా?" అని ప్రశ్నించారు. ఆ ఎన్నికల్లో బలవంతంగా 1,045 మంది టీడీపీ అభ్యర్థులతో నామినేషన్లు ఉపసంహరింపజేశారని, 322 అక్రమ కేసులు బనాయించారని ఆరోపించారు. 182 చోట్ల ఎన్నికల కోడ్ ఉల్లంఘించి, 48 హత్యాయత్నాలు, 3 హత్యలకు పాల్పడి.. ప్రశాంతంగా ఎన్నికలు జరిగాయని ఇప్పుడు చెబితే ప్రజలు నమ్మే స్థితిలో లేరని ఆయన స్పష్టం చేశారు.

జగన్‌ను ఓడించి విశాఖను ప్రజలే కాపాడుకున్నారు

స్థానిక ఎన్నికల్లో ఓటమి భయంతోనే వైసీపీ 'సేవ్ వైజాగ్' డ్రామా అని విమర్శలు
మేం గూగుల్ తెస్తే.. జగన్ గంజాయి మాఫియాను ప్రోత్సహించారని ఆరోపణ
రుషికొండపై రూ.500 కోట్లు ఖర్చు చేసినా అభివృద్ధిని పట్టించుకోలేదంటూ ఫైర్
కూటమి ప్రభుత్వంలో విశాఖను అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దుతామని హామీ


అమరావతి ,అక్టోబర్25((సామాన్యుడి అస్త్రం)

వైసీపీ నాయకులు 'సేవ్ వైజాగ్' పేరుతో కొత్త డ్రామాకు తెరలేపారని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటమి భయంతోనే ఇలాంటి నినాదాలు చేస్తున్నారని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తీవ్రస్థాయిలో విమర్శించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో జగన్ ను, వైసీపీని ఓడించి విశాఖ నగరాన్ని ప్రజలే కాపాడుకున్నారని ఆయన అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసీపీపై ఘాటు వ్యాఖ్యలు చేశారు.జగన్ ఐదేళ్ల పాలనలో విశాఖ నగరాన్ని, ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని గంటా ఆరోపించారు. 2014 ఎన్నికల్లో విశాఖ ప్రజలు తన తల్లిని ఎంపీగా ఓడించారనే కక్షతోనే జగన్ ఈ ప్రాంతంపై వివక్ష చూపారని అన్నారు. "మేం అధికారంలో ఉన్నప్పుడు గూగుల్ వంటి సంస్థలను ప్రోత్సహిస్తే, జగన్ రెడ్డి గంజాయి మాఫియాను పెంచి పోషించారు. విశాఖకు వచ్చిన కంపెనీలు కూడా ఆయన హయాంలో పక్క రాష్ట్రాలకు తరలిపోయాయి" అని విమర్శించారు. రుషికొండపై విలాసవంతమైన భవనాల కోసం రూ.500 కోట్లు ఖర్చు చేసిన జగన్, నగర అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని గంటా మండిపడ్డారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విశాఖ అభివృద్ధి పథంలో పయనిస్తోందని తెలిపారు. "విశాఖ రైల్వే జోన్‌కు జగన్ అడ్డుపడితే, మేం



అవసరమైన స్థలం కేటాయించి దాన్ని సాధించాం. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకున్నాం. భోగాపురం ఎయిర్‌పోర్టును పూర్తి చేశాం. పోలవరం ఎడమ ప్రధాన కాలువ ద్వారా ఉమ్మడి విశాఖ జిల్లాకు 30 టీఎంసీల నీటిని అందిస్తున్నాం" అని వివరించారు. భోగాపురం విమానాశ్రయానికి కేటాయించిన 500 ఎకరాలను కాజేయడానికి జగన్ కుట్ర చేశారని ఆరోపించారు.విశాఖను అంతర్జాతీయ స్థాయి నగరంగా అభివృద్ధి చేస్తుంటే, వైసీపీ నాయకులు కుట్రలతో అడ్డుకుంటున్నారని గంటా ధ్వజమెత్తారు.

విశాఖకు 870 కి.మీ దూరంలో తీవ్ర వాయుగుండం.. ఐఎండీ అప్ డేట్



బంగాళాఖాతంలో బలపడిన వాయుగుండం
దశలవారీగా బలపడి అతి తీవ్ర తుపానుగా మారే అవకాశం
అక్టోబర్ 28న బాపట్ల-విశాఖ మధ్య తీరం దాటే సూచన
గంటకు 140 కి.మీ. వేగంతో గాలులు వీస్తాయని అంచనా
మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని ప్రభుత్వం హెచ్చరిక

అమరావతి ,అక్టోబర్25(సామాన్యుడి అస్త్రం)

ఆగ్నేయ, తూర్పు మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం మరింత బలపడి తీవ్ర వాయుగుండంగా మారింది. ఇది దశలవారీగా బలపడి "అతి తీవ్ర తుపాను"గా మారి ఆంధ్రప్రదేశ్ తీరం వైపు దూసుకొచ్చే ప్రమాదం ఉందని భారత వాతావరణ శాఖ (×వీణ) హెచ్చరికలు జారీ చేసింది. ఈ నెల 28వ తేదీ ఉదయం బాపట్ల, విశాఖపట్నం మధ్య తీరాన్ని దాటే సూచనలు ఉన్నాయని, ఈ మేరకు ఆంధ్రప్రదేశ్, యానాం తీరాలకు ఆరెంజ్ మెసేజ్ జారీ చేసింది. తుపాను ప్రభావంతో భారీ వర్షాలు, ప్రచండ గాలులు వీచే అవకాశం ఉండటంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది.ఆదివారం ఉదయం 11:30 గంటల సమయానికి ఈ తీవ్ర వాయుగుండం విశాఖపట్నానికి ఆగ్నేయంగా 870 కిలోమీటర్ల దూరంలో, కాకినాడకు 960 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. అదేవిధంగా, మచిలీపట్నానికి 1,060 కిలోమీటర్లు, బాపట్లకు 1,130 కిలోమీటర్ల దూరంలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం గంటకు 5 కిలోమీటర్ల నెమ్మది వేగంతో నైరుతి దిశగా కదులుతున్న ఈ వ్యవస్థ, సోమవారం (అక్టోబర్ 26) ఉదయానికి తుపానుగా మారనుంది.వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, ఈ తుపాను అక్టోబర్ 27 ఉదయానికి తీవ్ర తుపానుగా, అక్టోబర్ 28 ఉదయానికి అతి తీవ్ర తుపానుగా రూపాంతరం చెందుతుంది. అనంతరం వాయవ్య దిశగా పయనించి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలోకి ప్రవేశించి, ఆంధ్రప్రదేశ్ తీరానికి సమీపంలోకి రానుంది. అక్టోబర్ 28వ తేదీ మధ్యాహ్నంలోపు బాపట్ల–విశాఖపట్నం మధ్య, యానాం సమీపంలో ఇది తీరం దాటే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. తీరం దాటే సమయంలో గంటకు 115 నుంచి 125 కిలోమీటర్ల వేగంతో పెను గాలులు వీస్తాయని, గరిష్ఠంగా గంటకు 140 కిలోమీటర్ల వేగాన్ని కూడా తాకే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.ఈ హెచ్చరికల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ూూూణహీూ) ముందస్తు చర్యలు చేపట్టింది. తుపాను తీవ్రత దృష్ట్యా ప్రజలు, ముఖ్యంగా తీరప్రాంత వాసులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లరాదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే వేటకు వెళ్లిన వారుంటే వెంటనే సురక్షిత ప్రాంతాలకు తిరిగి రావాలని కోరింది. "బోట్లు, వలలను సురక్షిత ప్రాంతాల్లో జాగ్రత్తగా కట్టి ఉంచాలి. సముద్ర తీరాల్లో అలల ఉద్ధృతి ఎక్కువగా ఉంటుంది కాబట్టి, బీచ్‌ల వద్ద సెల్ఫీలు దిగే ప్రయత్నం చేయరాదు" అని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ హెచ్చరించారు.తుపాను కదలికలను ఎప్పటికప్పుడు నిశితంగా గమనిస్తున్నామని, ప్రభుత్వ యంత్రాంగం అన్ని రకాల సహాయక చర్యలకు సిద్ధంగా ఉందని అధికారులు తెలిపారు. తీరప్రాంత జిల్లాల యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి, అవసరమైన ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు అధికారిక ప్రకటనలను గమనిస్తూ, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

విశాఖ గంగవరం బీచ్ పై ఆనంద్ మహీంద్రా ఆసక్తికర ట్వీట్

వైజాగ్‌లోని గంగవరం బీచ్ అందంపై ఆనంద్ మహీంద్రా ప్రశంసల వర్షం
ఇది సాధారణ బీచ్ కాదు, ఆదిమానవుల కాలం నాటి సౌందర్యం అని వ్యాఖ్య
ఒకవైపు టెక్నాలజీ, మరోవైపు ప్రకృతి అద్భుతమంటూ ఆసక్తికర పోలిక
టెక్ హబ్‌గానే కాకుండా, పర్యాటక కేంద్రంగానూ వైజాగ్‌కు గొప్ప భవిష్యత్తు ఉందని జోస్యం
వైజాగ్‌లో రెండు అద్భుతమైన వృద్ధి గాథలు ఆవిష్కృతమవుతున్నాయని వెల్లడి

అమరావతి ,అక్టోబర్25((సామాన్యుడి అస్త్రం)

ప్రముఖ పారిశ్రామికవేత్త, మహీంద్రా గ్రూప్ ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా మరోసారి తన సోషల్ మీడియా పోస్ట్‌తో అందరి దృష్టిని ఆకర్షించారు. విశాఖపట్నం సమీపంలోని గంగవరం బీచ్ అద్భుతమైన సౌందర్యంపై ఆయన ప్రశంసల వర్షం కురిపించారు. ఈ బీచ్ ఫొటోలను పంచుకుంటూ, భారతదేశంలో పెద్దగా గుర్తింపుకు నోచుకోని తీరప్రాంత సౌందర్య ప్రదేశాల్లో ఇది ఎందుకు ఒకటిగా ఉందని ఆశ్చర్యం వ్యక్తం చేశారు.ఆదివారం తన 'సండే వాండరర్' సిరీస్‌లో భాగంగా ఆనంద్ మహీంద్రా గంగవరం బీచ్ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. "ఇది సాధారణంగా మనం ఊహించుకునే కొబ్బరి చెట్ల వరుసలతో ఉన్న బీచ్ కాదు. దీనికి భిన్నంగా, ఇక్కడి ఎత్తైన రాతి శిఖరాలు, కఠినమైన, ఆదిమానవుల కాలం నాటి సహజ సౌందర్యం ఆకట్టుకుంటాయి. నిజం చెప్పాలంటే, ఇలాంటి సహజమైన అందమే నన్ను మరింతగా ఆకర్షిస్తుంది. ఇది కేవలం సేదతీరడానికే కాకుండా, లోతుగా ఆలోచింపజేసే ప్రదేశం" అని ఆయన తన పోస్ట్‌లో పేర్కొన్నారు.వైజాగ్ అభివృద్ధిని ప్రకృతి సౌందర్యంతో పోలుస్తూ ఆయన ఒక ఆసక్తికరమైన వైరుధ్యాన్ని ప్రస్తావించారు.ల

హెల్త్ జోన్


మెదడు ఆరోగ్యాన్ని కళ్లు, చెవులు చెప్పేస్తాయి!

కళ్లు, చెవుల ద్వారా మెదడు పనితీరు క్షీణతను ముందే గుర్తించవచ్చు
కంటిలోని రెటీనా, మెదడు కణజాలంతో సమానమని నిపుణుల వెల్లడి
వినికిడి లోపం డిమెన్షియాకు ఒక ప్రధాన కారణంగా అధ్యయనాల్లో గుర్తింపు
డయాబెటిస్, అధిక రక్తపోటు కంటి, చెవిలోని సున్నితమైన రక్తనాళాలను దెబ్బతీస్తాయి
నిపుణుల సలహాతో క్రమం తప్పకుండా రెటీనా, వినికిడి పరీక్షలు అవసరం

మన ఆరోగ్యం గురించి తెలుసుకోవాలంటే రక్తపోటు, షుగర్ లెవెల్స్ మాత్రమే కాదు, మన కళ్లు, చెవులు కూడా కీలకమైన సూచికలని ఆధునిక వైద్య పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. మెదడు పనితీరు క్షీణించడం, డయాబెటిస్, రక్తనాళాల సమస్యలు వంటి తీవ్రమైన అనారోగ్యాల లక్షణాలు బయటపడటానికి ఏళ్ల ముందే మన కళ్లు, చెవులలో తొలి సంకేతాలు కనిపిస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

కన్ను.. మెదడుకు కిటికీ లాంటిది

కంటిలోని రెటీనా పొర, పిండ దశలో మెదడుతో పాటు ఒకే కణజాలం నుంచి ఏర్పడుతుంది. అందుకే రెటీనాను "బయటకు కనిపించే మెదడు భాగం"గా నిపుణులు అభివర్ణిస్తారు. మన శరీరంలో నరాలను, సూక్ష్మ రక్తనాళాలను నేరుగా చూడగలిగే ఏకైక ప్రదేశం రెటీనా. 'ఆప్టికల్ కోహెరెన్స్ టోమోగ్రఫీ అనే పరీక్ష ద్వారా కేవలం రెండు నిమిషాల్లో రెటీనాలోని నరాల పొరల మందాన్ని అత్యంత కచ్చితంగా కొలవవచ్చు.



చలికాలంలో పెరుగు తినొచ్చా? జలుబు చేస్తుందా?

చలికాలంలో పెరుగు తింటే జలుబు, దగ్గు వస్తాయనడం కేవలం అపోహే
పెరుగులోని ప్రోటీన్లు, కాల్షియం రోగనిరోధక శక్తిని పెంచడానికి తోడ్పాటు
గది ఉష్ణోగ్రత వద్ద ఉన్న పెరుగును తీసుకోవడం ఆరోగ్యానికి సురక్షితం
జలుబు, గొంతునొప్పి ఉన్నప్పుడు చల్లటి పెరుగు తినకపోవడమే మంచిది
రాత్రిపూట కంటే పగటి భోజనంలో పెరుగును చేర్చుకోవడం ఉత్తమమంటున్న నిపుణులు

చలికాలం ప్రారంభం కాగానే చాలామంది ఇళ్లలో పెరుగు వాడకం తగ్గిపోతుంది. పెరుగు తింటే జలుబు, దగ్గు, కఫం వంటి సమస్యలు వస్తాయని చాలామంది బలంగా నమ్ముతారు. ఈ కారణంగా భారతీయ వంటల్లో అంతర్భాగమైన పెరుగును శీతాకాలంలో దూరం పెడుతుంటారు. అయితే, ఈ నమ్మకంలో ఎంతవరకు నిజం ఉంది? శీతాకాలంలో పెరుగు తినడం ఆరోగ్యానికి మంచిదేనా? అనే సందేహాలపై పోషకాహార నిపుణులు స్పష్టత ఇస్తున్నారు. పెరుగు తినాలా వద్దా అనేది అందరికీ వర్తించే నియమం కాదని, అది పూర్తిగా వ్యక్తిగత శరీరాకృతి, సహనంపై ఆధారపడి ఉంటుందని వారు వివరిస్తున్నారు. పెరుగు అనేది ప్రోటీన్లు, కాల్షియం, విటమిన్ బి వంటి కీలక పోషకాల గని. ముఖ్యంగా ఇందులో ఉండే లైవ్ కల్చర్స్ (జీర్ణవ్యవస్థకు మేలు చేసే మంచి బ్యాక్టీరియా) జీర్ణక్రియను మెరుగుపరిచి, పేగుల ఆరోగ్యాన్ని కాపాడతాయి. ఈ పోషకాలన్నీ కలిసి రోగనిరోధక శక్తిని సాధారణ స్థాయిలో ఉంచడానికి దోహదం చేస్తాయి. కాబట్టి సమతుల్య ఆహారంలో భాగంగా చలికాలంలో కూడా పెరుగును తీసుకోవడం వల్ల ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. అసలు జలుబు రావడానికి కారణం వైరస్‌లే తప్ప, పెరుగు వంటి ఆహార పదార్థాలు కాదని



నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అయితే, ఇప్పటికే గొంతునొప్పి, ముక్కు దిబ్బడ, దగ్గు వంటి సమస్యలతో బాధపడుతున్నప్పుడు, ఫ్రిజ్‌లోంచి తీసిన చల్లటి పెరుగును తింటే కొంత అసౌకర్యంగా అనిపించవచ్చు. ఆ చల్లదనం గొంతులో చికాకును పెంచే అవకాశం ఉంటుంది. అందుకే అనారోగ్యంగా ఉన్నప్పుడు చల్లటి పదార్థాలకు దూరంగా ఉండమని సలహా ఇస్తారు. అంతేగానీ, పెరుగు తినడం వల్ల కఫం ఉత్పత్తి పెరుగుతుందనడానికి బలమైన శాస్త్రీయ ఆధారాలు లేవు.

డైటింగ్‌తో తగ్గిన బరువు మళ్లీ పెరుగుతోందా?

డైటింగ్ తర్వాత బరువు మళ్లీ పెరగడానికి శరీర మార్పులే కారణమంటున్న నిపుణులు
లెప్టిన్ తగ్గడం, గ్రెలిన్ పెరగడం ఆకలిని పెంచే అవకాశం
బరువు తగ్గినప్పుడు శరీరానికి అవసరమయ్యే కేలరీలు తగ్గుతాయి
అతిగా డైటింగ్ చేయడం వల్ల కండరాలు తగ్గి అలసట పెరిగే ఛాన్స్
నిద్రలేమి, ఒత్తిడి, శారీరక కదలికలు తగ్గడం వల్ల కూడా ప్రభావం

బరువు తగ్గడానికి నెలల తరబడి డైటింగ్ చేస్తారు. నచ్చిన ఆహారాన్ని తగ్గించుకుంటారు. వ్యాయామంతో చెమటోడుస్తారు. అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నాక ఎంతో సంతోషిస్తారు. కానీ కొంతకాలానికి తగ్గిన బరువు మళ్లీ పెరుగుతుంది. దీంతో చాలామంది తమ ప్రయత్నంలో లోపం ఉందని భావిస్తారు. అయితే, బరువు తగ్గిన తర్వాత శరీరంలో జరిగే హార్మోన్ల మార్పులు, ఆకలి పెరగడం, శక్తి



వినియోగం తగ్గడం కూడా ఇందుకు కారణమవుతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.

ఆకలిని పెంచే హార్మోన్లు

శరీరంలో కొవ్వు తగ్గినప్పుడు లెప్టిన్ అనే హార్మోన్ స్థాయిలు పడిపోతాయి. ఇది మెదడుకు శరీరంలో నిల్వ ఉన్న శక్తి గురించి సంకేతాలిస్తుంది. దీని స్థాయిలు తగ్గితే ఆకలి పెరగవచ్చు. మరోవైపు ఆకలిని పెంచే గ్రెలిన్ హార్మోన్ స్థాయిలు కూడా పెరగవచ్చు.
దీంతో తిన్న తర్వాత కడుపు నిండిన భావన తగ్గి, మళ్లీ తినాలనిపిస్తుంది.

భారత స్పిన్నర్ల ధాటికి జింబాబ్వే విలవిల.. మరో మ్యాచ్ మిగిలుండగానే సిరీస్ విజయం

- జింబాబ్వేతో వన్డే సిరీస్‌ను 2-0తో కైవసం చేసుకున్న భారత మహిళల జట్టు
- రెండో వన్డేలో 121 పరుగుల భారీ తేడాతో విజయం
- హర్మన్‌ప్రీత్ కౌర్, దీప్తి శర్మ అద్భుత సెంచరీలు
- భారీ లక్ష్య ఛేదనలో తడబడిన జింబాబ్వే
- 4 వికెట్లతో చెలరేగిన వైష్ణవి శర్మ, 3 వికెట్లు తీసిన దీప్తి

జింబాబ్వేతో జరిగిన రెండో వన్డేలో భారత మహిళల జట్టు



అద్భుత ప్రదర్శనను కొనసాగించింది. హర్మన్‌ప్రీత్ కౌర్ (126), ఆల్‌రౌండర్ దీప్తి శర్మ (106లి) అద్భుత శతకాలతో చెలరేగడం, ఆ తర్వాత బౌలర్లు రాణించడంతో భారత్ 121 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. ఈ గెలుపుతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 2-0 తేడాతో కైవసం చేసుకుంది. వడోదర వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. కెప్టెన్ స్మృతి మంధాన (0), షఫాలీ వర్మ (8) తక్కువ స్కోర్లకే పెవిలియన్ చేరడంతో 19 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన ప్రతీక రావల్ (61)తో కలిసి హర్మన్‌ప్రీత్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దింది. ఆ తర్వాత దీప్తి శర్మ జత కలవడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. హర్మన్‌ప్రీత్, దీప్తి శర్మలు జింబాబ్వే బౌలర్లపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించి శతకాలతో కదం తొక్కారు. దీంతో భారత జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 328 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది.

క్రీడా జోన్

టీ20 క్రికెట్‌లో టీమిండియా అరుదైన ఘనత.. తొలి జట్టుగా ప్రపంచ రికార్డు!

- న్యూజిలాండ్‌పై రెండో టీ20లో భారత్ ఉత్కంఠ విజయం
- టీ20 ఫార్మాట్‌లో 200 విజయాలు అందుకున్న తొలి జట్టుగా ప్రపంచ రికార్డు
- ఈ మ్యాచ్‌తో తన 300వ అంతర్జాతీయ టీ20 పూర్తి చేసుకున్న భారత్

టీ20 క్రికెట్ చరిత్రలో టీమిండియా సరికొత్త ప్రపంచ రికార్డును నెలకొల్పింది. న్యూజిలాండ్‌తో శనివారం జరిగిన రెండో టీ20లో అద్భుత విజయం సాధించి, ఈ ఫార్మాట్‌లో 200 విజయాలు పూర్తి చేసుకున్న తొలి జట్టుగా చరిత్ర సృష్టించింది. టాప్ ఆర్డర్ విఫలమైన చోట, యువ ఆటగాళ్లు తిలక్ వర్మ, నితీశ్ రెడ్డి అసాధారణ పోరాట పటిమతో జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించారు. ఈ మ్యాచ్ టీమిండియాకు 300వ అంతర్జాతీయ టీ20 కావడం గమనార్హం. ఇప్పటివరకు ఆడిన 300 మ్యాచ్‌లలో భారత్ 200 విజయాలు సాధించగా, 83 మ్యాచ్‌లలో ఓటమిపాలైంది. మరో 7 మ్యాచ్‌లు టైగా ముగియగా, 10 మ్యాచ్‌లు ఫలితం తేలకుండా రద్దయ్యాయి. ఈ జాబితాలో భారత్ తర్వాతి స్థానంలో పాకిస్థాన్ ఉంది. పాక్ 304 మ్యాచ్‌లలో 176 విజయాలు సాధించింది. వీరి తర్వాత న్యూజిలాండ్ (135), దక్షిణాఫ్రికా (129), ఇంగ్లండ్ (128), ఆస్ట్రేలియా (127) జట్లు ఉన్నాయి.




హర్మన్ సెంచరీ, దీప్తి రికార్డు శతకం..



వడోదర వేదికగా జింబాబ్వేతో జరుగుతున్న రెండో వన్డేలో భారత మహిళల జట్టు మాజీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (126), ఆల్ రౌండర్ దీప్తి శర్మ (106 నాటౌట్) శతకాలతో చెలరేగారు. ఆరంభంలో కేవలం 19 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన జట్టును ఈ ఇద్దరూ తమ అద్భుతమైన బ్యాటింగ్‌తో ఆదుకున్నారు. ఫలితంగా టీమిండియా నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 328 పరుగుల భారీ స్కోరు సాధించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఆరంభంలోనే గట్టి షాక్ తగిలింది. స్టార్ ఓపెనర్లు స్మృతి మంధాన (0), షఫాలీ వర్మ (8) స్వల్ప స్కోర్లకే వెనుదిరిగారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో క్రీజులోకి వచ్చిన హర్మన్‌ప్రీత్, ప్రతికా రావల్ (61)తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దింది. వీరిద్దరూ మూడో వికెట్‌కు 124 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. అర్ధశతకం పూర్తి చేసుకున్న తర్వాత ప్రతిక భారీ షాట్‌కు యత్నించి ఔటైంది.

టీమిండియా చేతిలో వరుసగా రెండు ఓటములపై న్యూజిలాండ్ కోచ్ ఏమన్నాడంటే..!

టీమిండియాతో జరిగిన రెండు టీ20 మ్యాచ్‌లలో తమ జట్టు ఓటమిపాలవడంపై న్యూజిలాండ్ హెడ్ కోచ్ రాబ్ వాల్టర్ స్పందించాడు. రెండు మ్యాచ్‌లలోనూ తమ జట్టు 80 శాతం వరకు అద్భుతంగా ఆడిందని, కానీ కీలక సమయాల్లో ఆటను ముగించడంలో విఫలమవ్వడమే పరాజయాలకు కారణమని విశ్లేషించాడు. క్రైస్ట్‌చర్చ్‌లోని హేగ్లీ ఓవల్ వేదికగా జరిగిన రెండు మ్యాచ్‌లలోనూ న్యూజిలాండ్ 4 వికెట్ల తేడాతో ఓటమి చవిచూసిన విషయం తెలిసిందే. ఈ పరాజయాలపై



న్యూజిలాండ్ క్రికెట్ (NZC) విడుదల చేసిన వీడియోలో వాల్టర్ మాట్లాడుతూ, "టీ20 క్రికెట్‌లో గెలుపోటముల మధ్య తేడా చాలా స్వల్పంగా ఉంటుంది. రెండు మ్యాచ్‌లలోనూ మేము సులభంగా గెలవాల్సిన స్థితిలో ఉన్నాం. కానీ, ఆటను మా వైపు తిప్పుకోగల కొన్ని అవకాశాలను చేజార్చుకున్నాం.

బిజిలీగా రుహానీ శర్మ

వెర్సటైల్ స్టార్ దుల్కర్ సల్మాన్ హీరోగా, క్రియేటివ్ డైరెక్టర్ పవన్ సాధినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఆకాశంలో ఒక తార'. గీతా ఆర్ట్స్, స్వప్న సినిమా, లైట్‌బాక్స్ మీడియా బ్యానర్లపై సందీప్ గున్నం, రమ్య గున్నం ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సాత్విక వీరవల్లి కథానాయికగా పరిచయమవుతుండగా, శ్రుతి హాసన్ కీలక పాత్రలో నటిస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి మరో ముఖ్యమైన పాత్రను మేకర్స్ పరిచయం చేశారుఈ సినిమాలో బిజిలీగా నటిస్తున్న రుహానీ శర్మ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. కిటికీ పక్కన కూర్చుని కనిపిస్తున్న ఆమె సంప్రదాయ దుస్తుల్లో, అందంగా ఆకట్టుకున్నారు. బిజిలీ పాత్ర సినిమాలో ఎలాంటి మలుపులు తీసుకొస్తుందనే ఆసక్తిని ఈ ఫస్ట్ లుక్ పెంచుతోంది. అనుకోని సమయంలో కథలోకి ప్రవేశించి, అప్పటివరకు సాగుతున్న ప్రయాణానికి కొత్త వెలుగును తీసుకొచ్చే పాత్రగా బిజిలీని మేకర్స్ పరిచయం చేశారు. అనుకోకుండా ఎదురయ్యే ఓ పరిచయం.. ఆ ప్రయాణంలో ఊహించని అందమైన అనుభూతులను తీసుకొస్తుంది. ఈ చిత్రానికి సుజిత్ సారంగ్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం సమకూరుస్తున్నారు. శ్వేత సాబు సిరిల్ ప్రొడక్షన్ డిజైనర్‌గా పనిచేస్తున్నారు. నవంబర్ 20న తెలుగు, తమిళం, హిందీ, మలయాళ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు.



ఇంకా షాక్‌లోనే ఉన్నా.. నాపై దాడి ఎందుకు?

తన కారుపై ఇటీవల జరిగిన కాల్పుల ఘటనపై బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్ తొలిసారిగా స్పందించాడు. తాను ఇప్పటికీ తీవ్ర షాక్‌లో ఉన్నానని, తనకు ఎవరితోనూ శత్రుత్వం లేనప్పుడు తనపై ఎందుకు దాడి జరిగిందో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా ముంబై క్రైమ్ బ్రాంచ్ పోలీసులు ఆయన నివాసానికి వెళ్లి విచారించగా, టైగర్ ఈ విషయాలు వెల్లడించాడు.అక్టోబర్ 18వ తేదీ సాయంత్రం 7 గంటల సమయంలో జుహూ ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. ఫుట్‌బాల్ సెషన్ ముగించుకుని ఇంటికి తిరిగి వస్తుండగా, బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు టైగర్ ప్రయాణిస్తున్న బీఎండబ్ల్యూ కారుపై ఐదు నుంచి ఆరు రౌండ్ల కాల్పులు జరిపారు.



పీరియడ్స్ టైంలో విజయ్ దేవరకొండ కేరింగ్..



ప్రముఖ నటి రష్మిక మందన్న తన వ్యక్తిగత విషయాలతో పాటు నెలసరి సమయంలో మహిళలు ఎదుర్కొనే ఇబ్బందులు, ఆ సమయంలో తన భర్త, నటుడు విజయ్ దేవరకొండ తీసుకునే శ్రద్ధ గురించి ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలను వెల్లడించారు. నెలసరి సమయంలో తాను తీవ్రమైన నొప్పితో బాధపడుతుంటే, ఆ విషయం అర్థం చేసుకుని విజయ్ తనను ఎంతో జాగ్రత్తగా చూసుకుంటాడని రష్మిక తెలిపారు. "ఆ సమయంలో విజయ్ నాకు కడుపుపై మెల్లగా నిమరడంతో పాటు, చేతులు, కాళ్లు ఒత్తుతాడు. 'నేను ఇంతకంటే ఏం చేయలేను కదా' అని అంటుంటాడు. అతను అలా పక్కన ఉండటం ఎంతో ఓదార్పునిస్తుంది" అని ఆమె వివరించారు.

సెన్సార్ బోర్డులో భారీ డేటా లీక్..



'కేంద్ర ఫిల్మ్ సర్టిఫికేషన్ బోర్డు' (సీబీఎఫ్‌సీ)లో భారీ భద్రతా వైఫల్యం వెలుగుచూసింది. సుమారు 500కు పైగా ఫీచర్ ఫిల్మ్‌లతో సహా ఇతర చిత్రాలకు సంబంధించిన అత్యంత కీలకమైన సర్టిఫికేషన్ రికార్డులు ఆన్‌లైన్‌లో లీక్ కావడం సినీ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. సినిమాల సెన్సార్ అనుమతుల కోసం నిర్మాతలు దరఖాస్తు చేసుకునే అధికారిక ఆన్‌లైన్ వ్యవస్థ 'ఈ-సినీప్రమాణ్' పోర్టల్ నుంచే ఈ సమాచారం బయటకు పొక్కినట్లు తేలింది. ఈ ఘటన సెన్సార్ బోర్డు పనితీరు, డిజిటల్ భద్రతా ప్రమాణాలపై తీవ్ర ఆందోళనలను రేకెత్తిస్తోంది.లీకైన సమాచారంలో సినిమాల పూర్తి కాపీలు లేనప్పటికీ, వాటికి సంబంధించిన అత్యంత సున్నితమైన డాక్యుమెంట్లు ఉన్నాయి.

రజనీకాంత్ 'ధర్మన్'లో నయనతార..



సూపర్‌స్టార్ రజినీకాంత్ నటిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'ధర్మన్' గురించి ఒక ఆసక్తికరమైన అప్‌డేట్ వెలువడింది. ఈ సినిమాలో కథానాయికగా లేడీ సూపర్‌స్టార్ నయనతార నటిస్తున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. గత కొంతకాలంగా జరుగుతున్న ప్రచారానికి తెరదించుతూ, దర్శకుడు అశ్వత్ మారిముత్తు సోషల్ మీడియా వేదికగా ఆమెకు స్వాగతం పలికారు. దీంతో రజనీ-నయన్ అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు.ఆదివారం సాయంత్రం 'ధర్మన్' చిత్ర నిర్మాణ సంస్థ రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్, తమ సోషల్ మీడియా ఖాతాలో "కొన్ని కళ్లు అన్నీ చెప్పేస్తాయి. ఆ తేజస్సు రాబోతోంది" అంటూ ఓ ఆసక్తికర పోస్ట్ పెట్టింది. ఆ తర్వాత కొద్ది గంటలకే దర్శకుడు అశ్వత్ మారిముత్తు స్పందిస్తూ, నయనతారను ట్యాగ్ చేసి "మా టీమ్‌లోకి స్వాగతం మేమ్" అని పోస్ట్ చేయడంతో ఈ వార్త ఖరారైంది.రజినీకాంత్, నయనతార కాంబినేషన్ వెండితెరపై ఎప్పుడూ ప్రత్యేకమే. వీరిద్దరూ కలిసి ఇప్పటివరకు 'చంద్రముఖి' (2005), 'కుచేలన్' (2008), 'దర్బార్' (2020), 'అన్నాత్తే' (2021) చిత్రాల్లో నటించారు. ఇప్పుడు 'ధర్మన్' వీరి కాంబినేషన్‌లో రాబోతున్న ఐదో సినిమా కావడంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.ఇప్పటికే ఈ సినిమా మూడు షెడ్యూళ్ల చిత్రీకరణ పూర్తి చేసుకున్నట్లు దర్శకుడు గతంలోనే ప్రకటించారు. ఇటీవల మైసూర్ షెడ్యూల్‌లో పాల్గొన్న నటి రాశీ ఖన్నా, రజినీకాంత్, రామ్ పోతినేనితో కలిసి ఉన్న ఫోటోలను పంచుకున్నారు. "మైసూర్‌లో ఉదయాన్నే రజనీ సార్, రామ్‌తో కలిసి వర్కౌట్లు, ఆలయాల సందర్శన, నవ్వులతో గడిపాను" అంటూ ఆమె చేసిన పోస్ట్ వైరల్‌గా మారింది.లోకనాయకుడు కమల్ హాసన్, ఆర్. మహేంద్రన్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఎస్. డిస్నీ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. రాక్ స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా, నికేత్ బొమ్మి సినిమాటోగ్రాఫర్‌గా, ప్రదీప్ ఇ. రాఘవ్ ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. భారీ తారాగణం, ప్రముఖ సాంకేతిక నిపుణులతో 'ధర్మన్' చిత్రంపై ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్నాయి.

రామ్‌చరణ్ సరసన అనీత్ పడ్డా!



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్(కాంబినేషన్‌లో రాబోతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం ఆర్సీ17 హీరోయిన్ ఎంపికపై టాలీవుడ్‌లో సరికొత్త చర్చ నడుస్తోంది. ఈ సినిమాలో కథానాయికగా క్రికెట్ దిగ్గజం సచిన్ టెండుల్కర్ కుమార్తె సారా టెండుల్కర్ నటిస్తుందనే ప్రచారం కాకుండా, బాలీవుడ్ బ్లాక్‌బస్టర్ ధురంధర్ ఫేమ్ సారా అర్జున్ పేరు వినిపించింది. తాజా ఫిలింనగర్ సమాచారం ప్రకారం ఈ రేసులోకి మరో సరికొత్త బాలీవుడ్ బ్యూటీ వచ్చి చేరింది.ఇటీవలే సయ్యారా సినిమాతో బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకొని, యూత్‌లో విపరీతమైన క్రేజ్ సంపాదించుకున్న టాలెంటెడ్ బ్యూటీ అనీత్ పడ్డాను రామ్ చరణ్‌కు జోడీగా సుకుమార్ పరిశీలిస్తున్నట్లు నెట్టింట జోరుగా టాక్ నడుస్తోంది. సారా అర్జున్.. చరణ్ పక్కన చిన్నపిల్లలా కనిపిస్తుందేమో అనే సందేహంతో, మేకర్స్ అనీత్ పడ్డా వైపు మొగ్గు చూపుతున్నట్లు ఇండస్ట్రీ వర్గాల సమాచారం.మరికొందరు ఈ సినిమాలో ఇద్దరు హీరోయిన్లు ఉండే అవకాశం ఉందనే ఊహాగానాలు కూడా వ్యక్తం చేస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ భారీ పాన్-ఇండియా ప్రాజెక్టుకు సంబంధించిన లాంఛనమైన పూజా కార్యక్రమాలు అక్టోబర్ 26 లేదా 27 తేదీల్లో జరగనున్నాయి. ఈ పూజా ఈవెంట్ రోజే హీరోయిన్ ఎవరనే విషయంపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.

PRINTED AND PUBLISHED BY PANUTULA PRIYANKA, ON BEHALF OF PANUTULA PRIYANKA, PRINTED AT M/S.PARAHUSHAR PRINTING PUBLICATION, 1-4-36, SRINAGAR COLONY, MAHABUBABAD, WARANGAL TELANGANA -506101.AND PUBLISHED AT #H.NO.12-155, RAVINDER REDDY COMPLEX, NEAR HANUMANTEMPLE, IDA BOLLARAM MUNICIPALITY, JINNARAM MANDAL, SANGAREDDY DIST - 502325, TELANGANA STATE. EDITOR: PANUTULA PRIYANKA. RNI NO: TGTEL/25/A1872, Email: mathrubhoomiceo@gmail.com, Phone: 9182698313.